24/4 Mile Stone


# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాసపత్రిక
జూన్-2026
₹25





ముళ్ళపూడి వెంకటరమణ
హాస్య కథల పోటీ
ఫలితాలు





**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548

తెలుగులో వెలువడుతున్న
ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం




జూన్-2026

24 వ సంవత్సరం ✦ 4 వ సంచిక

ముఖచిత్రం:
నయన్‌సారిక
కార్టూన్: గోపాలకృష్ణ

సంవత్సర చందా-రూ.300/- | 2 సంవత్సరాల చందా-రూ.600/- | జీవిత చందా- రూ.5000/-

## *Publisher& Editor-Ramu. P*

Editorial Office: **HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam, **YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist. *Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*Full'Pillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*

Dr. K.Ramakrishna, Sarasi, Dayakar, Krishna, Nagisetty, Sangram, GopalKrishna, Bomman, Gandhi,Venkat, Kandlakunta SarathChandra Vadlamannati Gangadhar.

*D.T.P:*

P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya

*Well Wishers:*


Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
K.V.V.Satyanarayana
Akshagna Vidya Venkat
Dr.V.V.Rama Kumar
Dr.Surepalli Vijaya

*Prize Sponsers*

K.V.V.Satyanarayana
Akshagna Publications
K.Sundaresayya & Satyavathi
*Cartonist* Ramsheshu
Md.Raj Mohammed
Nimmi Madhubala
A.V. Krishna Murthy

**Hyderabad & Secunderabad Distributor:**

M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad -01
**Ph: 9666680857, 6301072906.**



# ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు




## ఈ సంచికలో కార్టూనిస్ట్‌లు


- సరసి
- గోపాలకృష్ణ
- కృష్ణ
- బాచి
- నాగిశెట్టి
- గాంధీ
- ప్రసిద్ధ
- భగవాన్
- బొమ్మన్
- చక్రవర్తి
- శర్మ
- శేఖర్
- శేఖర్‌బాబు
- డేవిడ్
- ప్రసాద్ కాజ
- శేషిరెడ్డి
- సునీల్
- వాడ్రేవు
- బీవీఎస్
- దొరశ్రీ
- పద్మ
- తోపల్లి ఆనంద్
- ఓంకార్
- పుష్ప
- ఆనంద్‌గుడి
- నరేష్
- శ్రీధర్
- సురేష్
- అప్పాజికృష్ణ
- పి.పి.నాయుడు
- ఉష
- ఎమ్.రాము
- షేక్ సుభాని

## శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -6 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -37 |
| ఇండియన్ ఇంక్ | - బీవీ పాండురంగారావు | -40 |
| వెనక్కి వెళ్ళే కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -46 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |


## సీరియల్స్


| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -14 |
| సినిమా తీద్దామా? | -గొలుసు సీరియల్ | -42 |



## కార్టూన్ శీర్షికలు




| | | |
|---|---|---|
| **నవ్వుకొమ్మచ్చి** | **-సరసి** | **-16** |
| **నవ్వే మందు** | **-ప్రసిద్ధ** | **-17** |
| **హే భగవాన్** | **-భగవాన్** | **-38** |
| **పంచ్ ఫ్రేమ్** | **-కృష్ణ** | **-25** |
| **నెల నెల నవ్వుల వెన్నెల** | | **-38** |
| **రిటైర్డ్‌లైఫ్** | **-బొమ్మన్** | **-47** |
| **ప్రొఫెషనల్ ఫన్** | **-నాగిశెట్టి** | **-27** |


**గమనిక:**


ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

## హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు... సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**ఆ**నందానికి వేదికలు... శుభకార్యాలు, పండుగలు... ఈ మధ్యనే మొదలయిన గెట్‌టు గెదర్... ఇలా చాలా ఉన్నాయి... మన జీవితాల్లో పెనవేసుకున్న ఆనందాల్లో ముఖ్యమయినది శుభకార్యాలకు హాజరు కావటం! అయితే ఎవరూ కూడా శుభకార్యాలకు వెళ్ళేటప్పుడు ఉత్తి చేతుల్తో వెళ్ళరు. చిన్నా చితకా బహుమతులు తీసుకు వెళ్ళటం మనకు తెలిసిన విషయమే! అయితే ఈ బహుమతులు ఇవ్వటంలో ఆంతర్యం ఏమిటీ?... మన స్థాయి(స్టేటస్)నిరూపించుకోవటానికి బహుమతులు తీసుకెళుతున్నామా? లేక వారికి ఉపయోగపడే విధంగా తీసుకెళుతున్నామా అంటే... చాలామంది దగ్గర మౌనమే సమాధానమౌతుంది. ఏమివ్వాలో తెలియక తికమక పడుతూ గడియారం, దేవుని చిత్రపటాలు ఇచ్చేస్తుంటాము... అవి ఇవ్వటం కంటే డబ్బు రూపంలో ఇస్తే ఆ కార్యక్రమం చేసేవాళ్ళకు ఏదో విధంగా ఉపయోగపడుతుంది కదా!? లేదా ఉపయోగపడే వస్తువు ఇస్తే మంచిది కదా? ఆలోచిద్దాం! అయితే ఇక్కడ మరో కోణం ఏమిటంటే ఇచ్చిన బహుమతులు తీసుకునే వారి ప్రవర్తన కూడా బాధిస్తుంది. ఆ బహుమతి ఎంత విలువయినది అని చూస్తున్నారు తప్ప ఎంత అభిమానంగా ఇచ్చారనేది గ్రహించటం లేదు అనేది వాస్తవం. వచ్చిన బహుమతుల్లో విలువైనవి ఒక వైపు భద్రంగా పెడుతుంటే... 'మామూలువి' అనుకునే బహుమతులు అక్కడే పక్కన (పడేస్తున్నారు) ఉంచుతున్నారు. బహుమతులు ఇచ్చేవి బంధాలు బలపడడానికే తప్ప... ప్రదర్శనకి కాదు అని గ్రహించాలి!

ఒడిస్సాలో చనిపోయిన వారి ఇంటికి పరామర్శకి వెళ్ళి ఎంతో కొంత పైకం అందజేస్తారు. అది పది రూపాయల దగ్గర్నుంచి పది వేలుదాక ఉంటుంది. గొప్ప సంప్రదాయం 'అలాంటి' పరిస్థితుల్లో ఆ డబ్బు ఎంతో ఆసరా అవుతుంది. అయితే బాధాకరమ విషయం ఏమిటంటే ఆ వచ్చిన సొమ్ముని 'జ్ఞాపకార్థం' అని గిఫ్ట్ రూపంలో అం పంచేయటం! ఒక మంచి సంప్రదాయాన్ని మన లెవల్ చూపడానికి చేసే ఈ ప 'ఈతరం' మానసిక స్థితికి నిదర్శనం.



ఆలోచనల పరిధి పెంచి...బహుమతులు ఇచ్చే వారు, తీసుకునేవారూ ఇద్దరూ 'అది' ఆత్మీయతకు నిదర్శనమనీ గ్రహిస్తే నిజంగా ఎంత ఆనందం చెప్పండి!

**అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...**

## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు


నెలనెలా... ప్రతినెలా
**4500 రూపాయల బహుమతులు**

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.












**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**
కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమతిగా **1000 రూపాయలు ఇస్తున్నారు.**


మొదటి బహుమతి- **రూ.500/-లు**
రెండవ బహుమతి- **రూ.300/-లు**
మూడవ బహుమతి- **రూ.200/-లు**



**అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారు** ఒకో కార్టూన్‌కి **రూ.500/-లు** చొప్పున
**ఈ రెండు** కార్టూన్లకు **1000 రూపాయలు** బహుమతి ఇస్తున్నారు.








**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.





ప్రముఖ కార్టూనిస్ట్ మోపూరు రామ్‌శేషు,
తమ కుమార్తె **మోపూరు పావని** జ్ఞాపకార్థం
ఈ కార్టూన్ కి **రూ.500/-లు**
బహుమతిగా ఇస్తున్నారు








కార్టూనిస్ట్ **ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి **500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






## ప్రతినెలా బహుమతులు

ప్రతి నెలా **హాస్యానందం**కు
వచ్చే కార్టూన్లలోంచి
**8** మంచి **కార్టూన్లకు బహుమతులు**
ఇస్తున్నారు **కార్టూన్ ఇష్టులు!**



## పలకరింపులు... కరచాలనాలు...
## నవ్వులు... ఆనంద వదనాలు....

# తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం ముఖచిత్రం!




**మనకు హాస్యంతో ఆనందాన్నిస్తూ...ఆరోగ్యకరమైన నవ్వులను పంచుతున్న కార్టూన్లకు బహుమతులిస్తూ... ఆ ఆనందాన్ని కలిగించిన కార్టూనిస్టులను సన్మానించాలనే సత్సంకల్పంతో హాస్యానందం నిర్వహిస్తున్న కార్యక్రమం తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం!**

తొలి తెలుగు కార్టూనిస్టు శ్రీతలిశెట్టి రామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని 15వ తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం, డా॥ కె.వి.రమణగారి ఆశీస్సులతో మే,20న హైదరాబాద్, రవీంద్రభారతి సమావేశ మందిరంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక సంస్థ సహకారంతో, సత్కళాభారతి, హాస్యానందం వైభవంగా నిర్వహించారు.

తెలంగాణా రాష్ట్ర పూర్వ సలహాదారు హాస్యానందం శ్రేయోభిలాషి డా॥ కేవీ రమణ, సినీదర్శకులు శ్రీ వి.ఎన్.ఆదిత్య, సినీనటులు శ్రీ జెన్నీ, 'కార్టూన్ వాచ్' సంపాదకులు శ్రీ త్రయంబక్ శర్మ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ దైవజ్ఞ శర్మ, రచయిత్రి శ్రీమతి సూరేపల్లి విజయ, బాపురమణ అకాడమీ–శ్రీ సుబ్బరాజు, అక్షజ్ఞ పబ్లిషర్–శ్రీ వెంకట్ అతిథులుగా పాల్గొన్న ఈ సభకు ఇంచుమించు తెలుగు కార్టూనిస్టులందరూ హాజరయ్యారు.

ఈ సభని శ్రీ బ్నింగారు సమన్వయం చేయగా, శ్రీ బి.ఎస్.శర్మ నిర్వహించారు. శ్రీమతి నవ్యశ్రీ పండా అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

















ముందుగా చి॥ సంహిత ఆలపించిన భక్తిగానంతో ఈ కార్యక్రమం మొదలయింది.

కార్టూనిస్టు శ్రీ వరప్రసాద్ కొన్ని గీతాలను ఆలపించారు.

చిరస్మరణీయులైన కార్టూనిస్టుల చిత్రపటాలకు ముఖ్య అతిధులు పుష్పాంజలి ఘటించారు.

ముందుగా కార్టూనిస్టులకు ఎల్లప్పుడు చేదోడు వాదోడుగా ఉండే ప్రముఖ కార్టూనిస్టు శ్రీకాజప్రసాద్‌గారికి **'కార్టూన్ మిత్ర'** పురస్కారం ముఖ్యఅతిధుల చేతుల మీదుగా అంద జేయబడింది.

**అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారు–** కీర్తిశేషులయిన కార్టూనిస్టుల కార్టూన్లతో ప్రచురించిన **'నవ్వుల వాన'** పుస్తకాన్ని ఈ సభలో ఆవిష్కరించారు.

సభకు విచ్చేసిన కార్టూనిస్టులకు, కార్టూన్ ఇష్టులకు ఈ పుస్తకాన్ని బహూకరించారు.

ఈ సభలో హాస్యానందం నిర్వహించిన శ్రీ తలిశెట్టి రామారావు అవార్డు(23), బాపురమణ పురస్కారం, శేఖర్ అవార్డు, బ్రిమ్మానందం పురస్కారం(10), అక్షజ్ఞ పురస్కారం(10) కార్టూన్ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు.


గత పదిహేను సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కార్టూనిస్టుల పండుగకు సహకరిస్తున్న ప్రముఖులకు, కార్టూనిస్టులకు 'హాస్యానందం' పత్రిక సంపాదకులు శ్రీ పి.రాము ధన్యవాదాలు తెలిపారు.

ముఖ్య అతిథి శ్రీ కేవీ రమణగారు– 'వచ్చే సంవత్సరం జరుపబోయే 'హాస్యానందం' పత్రిక రజతోత్సవ పండుగ అందరి సహకారంతో జరుపుదాం!' అన్నారు. ఈ కార్యక్రమానికి తమ పూర్తి సహకారం ఉంటుందని అక్షజ్ఞ పబ్లికేషన్స్ శ్రీ వెంకట్ హామీ ఇచ్చారు.

సత్కళాభారతి శ్రీ సత్యనారాయణగారి వందనసమర్పణతో సభ ముగిసింది.

సభకి ముందు... అల్పాహారం, సమ్మర్‌స్పెషల్ 'మామిడిపండ్లరసం'(ఫ్రూటీ)... సభానంతరం విందు ఏర్పాటు చేశారు.

**–వి.కె.ఆర్, హైదరాబాద్**













# తలిశెట్టి రామారావు కార్టూన్ పోటీలో బహుమతులు పొందిన కార్టూనిస్టులు



సరసి



శ్రీ కామేష్



శ్రీ క్రిప్



శ్రీభూపతి



శ్రీ బాచి



శ్రీ సాయికృష్ణ



శ్రీ నూకాపతి



శ్రీ వడ్డేపల్లి వెంకటేష్



శ్రీ చక్రవర్తి



శ్రీ వినోద్



శ్రీ ఆనంద్‌గుడి



శ్రీ సునీల్


శేఖర్ అవార్డు 2026- శ్రీ జెన్నా


బాపురమణ పురస్కారం 2026- శ్రీ ప్రసిద్ధ


శ్రీ బీవీఎస్


శ్రీ అత్తలూరి


శ్రీ శ్రీ(శ్రీనివాసులు)


శ్రీ టి.ఆర్.బాబు


శ్రీ పెండేల


శ్రీ గిరి


శ్రీమతి ఎన్.ధీరజ


ప్రార్థన గీతం-చి॥సంహిత


కార్టూనిస్టు వరప్రసాద్



కార్టూన్ మిత్ర
పురస్కారం 2026
శ్రీ కాజప్రసాద్

## బ్రహ్మానందం కార్టూన్ పోటీలో బహుమతులు పొందిన కార్టూనిస్టులు



శ్రీ కృష్ణ



శ్రీ బొమ్మన్



శ్రీ శర్మ



శ్రీ పుష్ప



శ్రీ నాగిశెట్టి



శ్రీ అరుణ్



శ్రీ గుత్తుల శ్రీనివాస్



శ్రీ షేక్ సుభాని



శ్రీ భాను

# అక్షజ్ఞ పురస్కారం కార్టూన్ పోటీలో బహుమతులు పొందిన కార్టూనిస్టులు


శ్రీ గాంధీ


శ్రీ ఓంకార్


శ్రీ శ్రీధర్


శ్రీ వర్మ


శ్రీ ప్రేమ్


శ్రీమతి పద్మ

## అక్షజ్ఞ పబ్లికేషన్స్ 'నవ్వుల వాన' పుస్తకావిష్కరణ



ఈ సభలో పదిమంది కార్టూనిస్టు గురువులు- శ్రీ తలిశెట్టిరామారావు, శ్రీ బాపు, శ్రీ బాలి, శ్రీ చంద్ర, శ్రీ సత్యమూర్తి, శ్రీ రామకృష్ణ, శ్రీ శంకు, కుమారి రాగతి పండరి, శ్రీ బాబు, శ్రీగోపి వేసిన కార్టూన్ల సంకలనం ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. సభకు విచ్చేసిన కార్టూనిస్టులు, కార్టూన్ ఇష్టులకు 200 రూపాయల విలువున్న ఈ పుస్తకాన్ని 'అక్షజ్ఞ' వారు ఉచితంగా అందజేసారు.

**ఈ పుస్తకం కావలసినవారు ఈ నెంబర్లకు సంప్రదించండి-8341450673, 8712729057**



కథ-కథనం

**యండమూరి వీరేంద్రనాథ్**

**యర్రంశెట్టి శాయి**





# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండో వాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. సాత్వికరావు ఆత్మహత్య ప్రయత్నంలో లలిత దగ్గరకు చేరతాడు. ఆనందరావు రాధని పెళ్ళి చేసుకోవాలనే తలంపుతో ప్లాన్లు వేస్తునే క్రమంలో...**ఆ తర్వాత...**

**ఆనందరావు వెళ్ళబోతూ ఆగి జయలక్ష్మితో "వచ్చేటప్పుడు పసుపు తీసుకొస్తాను. ఇంట్లో తాడు ఉంది. మీరు ఒప్పుకుంటే ఇప్పుడే మీ మెడలో తాళి కట్టి పెళ్లి చేసుకుంటాను. సిద్ధాంతిగారు కూడా ఇక్కడే ఉన్నారు కాబట్టి, ఆయన మంత్రాలు చదివి సామూహికంగా పెళ్లి చేస్తారు." అన్నాడు.**

**రాధ అదిరిపడి- "సామూహికంగానా?" అంది.**

**"క్షమించండి, నాకు తెలుగు సరిగ్గా రాదు. అదేదో పదం అంటారు. ఏమిటది?"**

**"శాస్త్రోక్తంగా!" అన్నాడు సిద్ధాంతి.**

**"అదే... అదే!"**

**"కానీ నాకు ఆకాశపందిరిలో అప్సరసలే పేరంటాలుగా, దేవతలే పురోహితులుగా చేసుకోవాలన్న కోరిక. అదీగాక ఇలా చేసుకుంటే మా బాబాయి చంపేస్తాడు."**

**"కాదు. శత్రువు బలహీనంగా ఉన్నప్పుడే చంపాలి. కోరిక వేడిగా ఉన్నప్పుడే తీర్చుకోవాలి." అన్నాడు వీరభద్రరావు.**

**"అవును! ఇనుము వేడిగా ఉన్నప్పుడే కొట్టాలి." అంది రాధ.**

"ఆలస్యం చేస్తే అమృతం బ్రాండు కూడా చేదు అవుతుంది." అన్నాడు సిద్ధాంతి.

"అందరూ నోరు ముయ్యండి!" అని జయలక్ష్మి వైపు తిరిగి- "...మరీ కావాలంటే బంధువుల మధ్య నువ్వు మళ్ళీ చేసుకోవచ్చమ్మా! ఇప్పుడు ఒప్పేసుకో. ఈ లోపులో ఇతడు ఛస్తే నీ అపూర్వమైన త్యాగానికి ఫలితం ఉండదు." అన్నాడు కల్నల్.

"ఇతడు చచ్చాక, నీ రెండో పెళ్లి నా చేతుల మీద ఫలక్‌నామా పాలెస్‌లోనో, రిషీవాలీ కొండ మీదో... పెద్ద పందిరేసి జరిపిస్తా!" ఆనందరావు వైపు కసిగా చూస్తూ అన్నది రాధ.

"క్షమించాలి! అన్నట్టు ఇంకో విషయం చెప్పడం మర్చిపోయా. నాకు క్యాన్సర్ లేదు!"

అందరూ షాక్ అయ్యారు.

జయలక్ష్మి మరీ ఎక్కువ. కానీ వెంటనే విషయం అర్థమై... మొహం విప్పారింది. మొహంలో సంతోషం ఆగలేదు. అతడిని అప్పుడే, అక్కడే ముద్దు పెట్టేసుకోవాలన్న కోరికని అతి కష్టం మీద ఆపుకుని- "నిజమా! మరెందుకు అలా చెప్పావు?" అని అడిగింది లక్ష్మి.

"దాన్ని బిస్కెట్ వేయటం అంటారమ్మా!" అన్నాడు కల్నల్.

కామన్ టేస్ట్ ఉన్న స్నేహితుడిని కలుసుకున్నంత ఆనందంగా ఆనందరావు ఆయన వైపు ముచ్చటగా చూస్తూ-

"ఓహో! బిస్కెట్ల గురించి మీకూ తెలుసా సార్?..." అడిగాడు.

"అదేలే! నీ వయసులో ఉన్నప్పుడు..." పక్కనున్న కూతురికి వినపడకుండా నసిగాడు కల్నల్.

"మరో ఐదు నిమిషాలు మీరు ఇలా చర్చించుకుంటూ ఉంటే దుర్ముహూర్తం వచ్చేస్తుంది." అంటూ తన ఉనికిని

నిరూపించుకున్నాడు సిద్ధాంతి.

"పసుపుకి చెప్పేసి... సాత్విక్‌ని తీసుకొని రెండు నిమిషాల్లో వచ్చేస్తాను!"

"సాత్విక్‌కి చెప్పి, పసుపు తీసుకొని రా!" సరిదిద్దింది రాధ.

"అలాగే... అలాగే!" అంటూ బయటకి పరిగెత్తాడు ఆనదరావు.

"నువ్వు సహాయం చేయకపోతే ఈపాటికి నా శవం నూతిలో తేలేదే అక్కా!" అంటూ జయలక్ష్మి రాధను కన్నీళ్ళతో కౌగిలించుకుంది. క్షమించాలి... చేతులతో కౌగిలించుకుంది.

"నిజంగా ఈ ఆనందరావు సాత్విక్‌కి చెప్పి... ఇక్కడికి రమ్మని అంటాడా? పసుపుతాడు తీసుకొస్తాడా? మళ్ళీ కనబడకుండా ఉండటం కోసం అట్నుంచి అటే పారిపోతాడా?" సంశయం వెలిబుచ్చాడు కల్నల్.

"నీదంతా నెగటివ్ థింకింగ్ నాన్న! అన్నీ సంశయాలే."

"మీరు ఏమీ అనుకోకపోతే ఒక మాట సార్!" అన్నాడు సిద్ధాంతి.

"మీరు అల్లుడ్ని ఎన్నుకోవడం కాదు. మీ అల్లుడు మిమ్మల్ని ఎన్నుకోవాలి."

వీరభద్రరావుకి ఆ మాటలు అర్థమై రియాక్ట్ అయ్యేలోపులో... అన్నట్టుగానే ఆనందరావు రెండు నిమిషాల్లో పసుపు, రెండు మంగళ సూత్రాలతో పరుగెత్తుకు వచ్చాడు.

"సార్! పసుపు కోసం వెళితే, పక్కనే సిల్వర్ షాపులో సూత్రం కూడా దొరికింది. సాత్విక్ కూడా ఫోన్లో దొరికాడు... జరిగిందంతా చెప్పాను. ఐదు నిమిషాల్లో ఇక్కడ ఉంటా అన్నాడు. ఎందుకైనా మంచిదని, ఇవ్వాళ ముహూర్తం బాగుంది కాబట్టి మీరు రెండు పెళ్లిళ్ళూ ఒకేసారి చేసేస్తారేమో అన్న ఉద్దేశ్యంతో రెండు సూత్రాలు..." అంటూ వాక్యం పూర్తి చేసే లోపులో కల్నల్ కటువుగా– "నేను ముందు అతన్ని పరిశీలించాలి!" అన్నాడు.

"అది కూడా చెప్పాను సార్!"

"ఏది కూడా చెప్పావు?"

"అదే సార్. 'కల్నల్ గారు పరిశీలిస్తారు. డ్రెస్ జాగ్రత్తగా వేసుకురా!' అని చెప్పాను."

కల్నల్ ఏదో అనబోతూ ఉండగా...

సిద్ధాంతిగారు కల్పించుకొని– "మీరందరూ ఒప్పుకుంటే... ఇది బ్రహ్మాండమైన ముహూర్తం. మళ్లీ ఇటువంటి ముహూర్తం 1213 సంవత్సరాల తర్వాత గానీ రాదు... మీకు నమ్మకం ఉంటే ఇప్పుడే ఇక్కడే రెండు పెళ్లిళ్ళూ ఒకేసారి చేయించేద్దాం. కావాలంటే ఆ తర్వాత బంధుమిత్రుల సపరివారంగా మళ్ళీ చేయొచ్చు." అన్నాడు.

కల్నల్ కూతురు వైపు తిరిగి– "ఏమంటావమ్మా?" అని అడిగాడు.

"మీకు ఇష్టమైతే నాకు ఇష్టమే నాన్న!" సాత్విక్‌ని తలచుకుంటూ అంది రాధ.

"అలాగే కానివ్వండి!" అన్నాడు కల్నల్.

"శుభస్య శీఘ్రం!" అన్నారు సిద్ధాంతి గారు.

ఆనందరావు పక్కకి వంగి ఆయన చెవిలో– "శోభనానికి మళ్లీ ఇటువంటి రోజు 100 సంవత్సరాల వరకూ కూడా రాదని చెప్పండి సార్!" అన్నాడు.

అది అందరికీ వినిపించి ఘొల్లున నవ్వారు.

**ఉపసంహారం:**

మరుని భార్య హర్షంతో చప్పట్లు కొడుతూ...


"చదువుల వెలదికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం రతినాథా...! వెళ్లి ఆ విషయం వాగేశ్వరికి చెబుదాం. మన పని పూర్తయినది" అన్నది.

**సమాప్తం కాదు....**



## నవ్వు కొమ్మచ్చి






సరసి

రెండో అధ్యాయం

మన్మథుడు అభావంగా– "అది అంత తొందరగా అయ్యే పని కాదు. ఆ ఇంద్రసతిని తక్కువ అంచనా వెయ్యకు. ఒకసారి భూమి వైపు చూడు!" అన్నాడు.

రతీదేవి అనుమానంగా క్రిందికి చూసింది.

ఆనందరావు చెప్పిన అడ్రస్ చూసుకుంటూ ఆటో దిగాడు సాత్విక్.

చిరునామా కరెక్ట్‌గానే ఉందని నిశ్చయించు కొని ఆ ఇంటి వైపు అడుగులు వేస్తూ ఉండగా పక్క సందులోంచి ముగ్గురు ముసుగు వ్యక్తులు వచ్చి ముక్కు అదిమి పెట్టి తీసుకెళ్ళి కారులో పడేశారు. భయంతో అతడికి స్పృహ తప్పింది.

అలా తాను ఎంతసేపు స్పృహ తప్పి ఉన్నాడో అర్థం కాలేదు.

తిరిగి మెలకువ వచ్చేసరికి ఆస్పత్రి బెడ్ మీద వెల్లకిల పడుకొని ఉన్నాడు.

ఒక ఆవిడ మొహం మీద బురఖా సర్దు కుంటూ గది బయటికి వెళుతోంది.

"నేను ఎక్కడ ఉన్నాను?" నీరసంగా అడి గాడు.

"దారుల్-ఉమ్-షాఫియా హాస్పిటల్" అని చెప్పి బయటికి వెళ్లిపోయింది.

అతడికి ఏమీ అర్థం కాలేదు.

అంతలో పొత్తి కడుపు దగ్గర మంట పుట్టి... దిండు మీద నుంచి కాస్త తల పైకెత్తి క్రిందికి చూసి కెవ్వున కేక వేశాడు.

✦✦✦

ఎదురుగా నిలబడిన జంటవైపు కనుల ముచ్చటగా చూస్తూ...

"ఒరేయ్! రెండు దండలు తీసుకు రండ్రా. కనీసం నా కళ్ళ ముందు వాళ్లు దండలు మార్చుకుంటూ ఉండగా చూస్తాను" అని... "కబురు చేస్తే మేము కూడా వచ్చేవాళ్లం కదమ్మా!" జయలక్ష్మితో అన్నాడు జగ్గారావు.

"ముహూర్తం మించిపోతోంది అన్నారు సిద్ధాంతిగారు. దాంతో అప్పటికప్పుడు షాప్ నుంచి మంగళసూత్రాలు తీసుకొచ్చి కట్టేసాడు పెదనాన్నా!" ఆనందరావు వైపు ఆప్యాయంగా చూస్తూ అన్నది జయలక్ష్మి.

"మీ నాన్నకి ఈ విషయం నువ్వు చెప్పకు. నెమ్మదిగా నేను చెప్తాలే! అయినా నెల రోజుల వ్యవహారమే కదా!"

"అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. ఆనంద రావుకి క్యాన్సర్ లేదు. కేవలం నేను తనని ప్రేమించడం కోసం అలా చెప్పాడట."

"చాలా మంచి వార్త చెప్పావమ్మ!... కానీ జాలితో మొదలైన ప్రేమ డిసెంబర్లో పుట్టిన చలి లాంటిది... ఫిబ్రవరి వచ్చేసరికి తగ్గి పోతుంది."


"కాదు పెదనాన్నాఁ నమ్మకం అనే ఏ.సి. వేసుకుంటే మార్చిలో కూడా ఉంటుంది."


"'వాస్తవం' అనే ఎండని... 'నమ్మకం' అనే ఏ.సి.ఆపలేదమ్మా. జీవితమంటే, ఏ.సి. వేసు కుని ఆ చలికి ఆగలేక దుప్పటి కప్పుకోవటం కాదు!" అని ఆనందరావు వైపు తిరిగి...

"నువ్వేమంటావు అల్లుడూ?" అడిగాడు.

"మీరిద్దరూ మాట్లాడుకున్నది... ఒక్కమాట అర్థం అయితే... ఈ పూలదండతో ఉరి తీయండి!" అన్నాడు.

జగ్గారావు అతడి వైపు ఆప్యాయంగా చూస్తూ– "ఏం చేస్తుంటావ్ బాబూ నువ్వు?" అడిగాడు.






"ప్రస్తుతానికి చిన్న చిన్న పనులు చేస్తూ ఉంటానండి... కానీ మీ గురించి లక్ష్మి అంతా చెప్పింది. మీరు ఒప్పుకుంటే మీ గ్యాంగ్‌లో చేరుతాను."

"నాతో చేరతావా?... మేం చేసే పనులకి సమాజంలో గౌరవం ఉండదు బాబూ!"

జంటలూ ఒక నెల ఆగి శోభన ముహూర్తాలు పెట్టుకోవచ్చు!" అన్నాడు.

"మాకు అంతకాలం వాయిదా వద్దు సార్! మీరు అనుమతిస్తే రేపే ఏ ఊటీయో... సిమ్లాయో వెళ్ళిపోతాం. ఆ పని ముగించుకు వచ్చి, మీ పనిలో జాయిన్ అవుతాను!" అని... వెనుక నించి జయలక్ష్మి గట్టిగా గిల్లేసరికి, కెవ్వున కేక వేయబోయి గమ్మున నిభాయించుకున్నాడు.

✦✦✦

ఒక ఎలుక చంద్రబోసు మోకాలి పైకి దూకి... అక్కడి నుంచి ముందుకొచ్చి పొట్ట మీదకి ఎక్కి పొత్తి కడుపు దగ్గర సెటిలై, మూతి ముందుకు జరిపి... నాలుకతో బొడ్డులో గుండ్రంగా తిప్పడంతో హఠాత్తుగా మెలకువ వచ్చి కళ్ళు విప్పేసరికి గదినిండా కొన్నివేల ఎలుకలు!

కొన్ని మంచం మీద కిందికి దిగుతున్నాయి. మరికొన్ని పైకి ఎగురుతున్నాయి. టేబుల్ మీద, దుప్పటి మీద, ఒంటి మీద, దిండు మీద, పైన సీలింగ్ ఫ్యాన్‌కి... పక్కన బాత్‌రూమ్ గడపకీ.... అన్నీ ఎలుకలే. వాటిని చూసి కెవ్వున కేక వేయబోయాడు. ఒక ఎలుక పైకి దూకి నోరు మూసింది. మాట బయటకి రాలేదు. మరో ఎలుక ముక్కులో తోక పెట్టి తిప్పింది. తుమ్ముతూ లేచాడు.

అప్పుడు పూర్తిగా మెలకువ వచ్చింది. ఒళ్లంతా చెమటతో తడిచిపోయింది. పక్కన లలిత గాఢనిద్రలో ఉంది.

టైం చూసుకున్నాడు. రాత్రి రెండు అయింది.

ఆలోచనలో పడ్డాడు. గత రెండ్రోజుల నుంచీ ఇన్ని 'ఎలుకల కల' తనకి ఎందుకు వస్తోంది?


చుట్టూ చూసాడు. గదంతా నిశ్శబ్దంగా ఉంది.

చప్పున ఏదో స్ఫురించింది..!


తన అనుమానానికి అర్థం తెలిసింది..!

"జూకా!" అని నెమ్మదిగా పిలిచాడు. మంచం కింద నుంచి అది పైకి వచ్చింది. దాన్ని పట్టుకుని చప్పుడు కాకుండా మంచం దిగి ముందు గదిలోకి వచ్చాడు.

**(సశేషం)**

# రీ సౌండ్



✦ **శ్రీలేఖ పి.ఎస్., సికింద్రాబాద్.**


**ఈ**సారి క్రాస్‌వర్డ్ చాలా సృజనాత్మకంగా ఉన్నది. కార్టూనిస్టుల పేర్లతో నింపబడునట్లు. 'నెల నెలా నవ్వుల వెన్నెల' ('తెలుగు కార్టూన్లు' అంశం) కార్టూన్లు అన్నీ బావున్నాయి. రాముగారి సంపాదకీయం వాస్తవికమైనది. మొదటి ముందడుగుకు స్ఫూర్తినిచ్చే ప్రోత్సాహం అందించే వారి మద్దతు లభిస్తే... ఇక వెనుతిరిగి చూడాల్సిన అవసరం ఉండదు. అన్ని రకాల మద్దతుతో పాటు విలువైన సలహాలు కూడా ఇవ్వాలి. అటువంటి వారి పట్ల కృతజ్ఞత చూపిస్తే, రెట్టింపు ప్రయోజనాలు – ఆనందం కలుగుతుంది. ఇది ప్రోత్సహించేవారికి శక్తినిచ్చి, ప్రోత్సాహకరమైన నిర్వహణను అవలంబించడానికి ఇతరులను కూడా ప్రేరేపిస్తుంది. 24 సంవత్సరాల ప్రచురణ ప్రయాణం మరియు 15సంవత్సరాల కార్టూనిస్టుల దినోత్సవ వేడుక నిర్వాహణ...సంపాదకుడు, బృందం, మద్దతుదారులు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహకరమైన వైఖరిని స్పష్టం చేస్తుంది. మీకు ఎల్లప్పుడూ విజయయాత్ర జరగాలని కోరుకుంటున్నాము.


✦ **పి.వి.పద్మావతి మధు నివ్రితి, హైదరాబాద్**

**మీ,** మా పత్రికలో 'గణితంపై' ఒక జోక్ చూడటం ఇదే మొదటిసారి. 'గణిత' 'ఆల్జీబ్రా' తరగతికి హాజరవుతున్న 'జీబ్రా' కార్టూన్! గీసినందుకు క్రివ్‌కు అభినందనలు. చకితం... గట్టిగా నవ్వు...జ్ఞానోదయం... ముచ్చటగా మూడు– తెప్పించిన టాప్ 8 జోకులు:– **1.** పక్షుల కోసం ట్విగ్గి (సరసి), **2.**లైబ్రరీ–వైఫై (కామేష్), **3.**'hellow-hell లో' మద్యం పోగాకు వల్ల (బాచీ), **4.**గ్లోబల్ వార్మింగ్ చూసి సూర్యుడు పారిపోవటం (పి.పి. నాయుడు), **5.**విద్యార్థులను బట్టి పట్టే రోబోలుగా మారుస్తున్న విద్యా వ్యవస్థ (నూకపతి), **6.**ఆన్‌లైన్ వివాహ ఆహ్వానం (చక్రవర్తి), **7.**చదువుకున్న విద్యార్థులు రోడ్లను కలుషితం చేస్తున్నారు (వినోద్), **8.**ఆల్కహాల్‌ను చూసి లివర్ పారిపోవడం (టి.ఆర్.బాబు), పై సమస్యలకు పరిష్కారాలు:– అవును, విద్యా వ్యవస్థను మార్చాలి. పాఠశాలల్లో మరిన్ని చిన్న ప్రాజెక్ట్ పనులను చేర్చాలి. ప్రాజెక్టులను విద్యా–సంస్థల పరిధిలోనే ఉపాధ్యాయుల సమర్థవంతమైన మార్గదర్శకత్వంతో పూర్తి చేయాలి విద్యార్థులు జట్లుగా. దయచేసి తల్లిదండ్రులపై భారం వేయవద్దు.శారీరక మరియు మానసిక విశ్రాంతి కోసం, క్రీడలు మరియు అభిరుచులపై రోజువారీ తరగతులు ఉండాలి విద్యాసంస్థలలో.

✦ **బి.వి.రామ్‌కుమార్, కర్నూలు**

**తె**లుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా రూపొందించిన ప్రత్యేక సంచిక నిజంగా ప్రత్యేక సంచికే! 48 పేజీలలో కార్టూన్‌లతో రూపొందించటం ఆషామాషి విషయం కాదు! ఎంతో చిత్తశుద్ధి ఉంటే తప్పా ఇది కుదరదు.మీ ఆలోచనా విధానం, ఆచరణాయోగ్యంగా మారటం హాస్యానందం బలం!




## బహుమతి పొందిన కథలు


| | | |
|---|---|---|
| మేధావుల కంపెనీలో వాదన వ్యసనం | -యండమూరి వీరేంద్రనాథ్ | -20 |
| పరమేశా! దొంగ విడువు | -వసుంధర | -21 |
| తాగినోళ్ళు అందరూ.. | -సరసి | -23 |
| ఖరీదైన చెప్పులు | -గంగాధర్ వడ్లమన్నాటి | -24 |
| అప్డేట్ అప్పారావు | -డా.వినోద్ కుమార్ నగరం | -26 |
| ఉత్కంఠా మజాకా | -దమ్మవళం శ్రీనివాస్ | -28 |
| ఓ రచయిత ప్రస్థానం | -పి.వి.రామశర్మ | -30 |
| తెలియదు...మర్చిపోయా...గుర్తు లేదు... | -కోనే నాగ వెంకట ఆంజనేయులు | -32 |
| కోడలు పిల్ల | -అభిమన్యు | -34 |
| కొత్త ఉద్యోగం | -తాత మోహనకృష్ణ | -35 |


**బహుమతి పొందిన కథలు**
**19వ పేజీ నుండి 36వ పేజీ వరకు**



**హా**స్యానందం మాసపత్రిక ప్రతి సంవత్సరం ముళ్ళపూడి వెంకట రమణ గారి పేరున కథల పోటీ నిర్వహించడం, ఒక పది మంచి హాస్య కథలకు బహుమతి ఇవ్వడం చూసి ఆనందిస్తున్నాను. కళామిత్రులు శ్రీ ఏ.వి.కృష్ణ మూర్తి గారు ఈ కథల పోటీ విజేతలకు బహుమతిస్తున్నారని తెలిసి సంతోషిస్తున్నాను.

ఈసారి కథలు చదవమని నన్ను కూడా ఇన్వాల్వ్ చేశారు. సరే బ్నింగారి ప్రోత్సాహంతో ఏ.వి.కృష్ణమూర్తి గారితో పాటు, కథలు చదివే భాగ్యం కలిగింది. చాలా కథలు చాలా చాలా బాగున్నాయి. నా వంతు ఓట్లు కొన్నింటికి వేసి వచ్చాను.

విజేతలకి... ఇతర కథా రచయితలకి నమస్కారాలు... అభినందనలు.

**-వరా ముళ్ళపూడి**

**శ్రీ ఎ.వి.కృష్ణమూర్తిగారి** సౌజన్యంతో హాస్యానందం నిర్వహించిన **ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీకి** సుమారు 210 దాక కథలు వచ్చాయి. వచ్చిన అన్ని కథలు బాగున్నా...చాలా కథలు ఒకటిన్నర పేజీలు దాటాయి(టైపింగ్‌లో), మరికొన్ని సగం పేజీలు కూడా రాలేదు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న పది కథలను ఎంపిక చేయడం జరిగింది. ఈ పోటీలో పాల్గొన్న రచయిత, రచయిత్రులకు ధన్యవాదాలు, విజేతలకు అభినందనలు.

ఈ కథలకు ప్రత్యేక ఆకర్షణగా బొమ్మలు వేసిన **శ్రీబొమ్మన్ గారికి** ప్రత్యేక ధన్యవాదాలు. **-సం॥**



**బ్నిం**గారు సూచించినట్లుగా గత 6 సంవత్సరాల నుంచి హాస్యానందం మాసపత్రిక ముళ్ళపూడి వెంకటరమణగారి పేరున నిర్వహిస్తున్న హాస్య కథల పోటీకి బహుమతి పారితోషికాన్ని అందిస్తున్నందుకు ఆనందిస్తున్నాను. ఈ సంవత్సరం కూడా చాలా మంచి కథలు వచ్చేయ్. ఈసారి ప్రత్యేకంగా నేను కూడా చదవడానికి ఉత్సాహపడ్డాను. చాలా బాగున్నాయి.అనుకున్నవి రెండు మూడుసార్లు చదివాను. అయితే నిర్ణయం మాత్రం నేను తీసుకోలేదు. శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ గారి అబ్బాయి శ్రీ వర ముళ్ళపూడి గారికి నేను చదివిన కొన్ని కథలు చూపించాను... వారు నిర్ణయించిన కథలకే బహుమతి ఇవ్వడం జరిగింది.

ఈసారి ప్రఖ్యాత రచయితలు కూడా పోటీలో పాల్గొన్నారు అని రిజల్ట్ ప్రకటించాక మాకు తెలిసింది. రచయితల పేరు తెలియకుండా కేవలం నెంబర్లతో మాత్రం మాకు జడ్జిమెంట్‌కి పంపించడం హాస్యానందం రాము గారి సరైన నిర్ణయంగా అభినందిస్తున్నాను.

**-ఏ.వి.కృష్ణమూర్తి,సికింద్రాబాద్**






# మేధావుల కంపెనీలో వాదన వ్యసనం



యండమూరి వీరేంద్రనాథ్-9246502662

**"మా** ఆయన పిచ్చి వదిలించండి... ఆ ఫోన్ పట్టుకొని వదలటం లేదు." అని వాపోయింది భార్య.

"ఏముంటుంది నాయనా అందులో?" అని అడిగాడు గురువు చిరునవ్వుతో.

"మేము మేధావులం. రాజకీయాల నుంచి క్రికెట్ వరకు; సాహిత్యం నుంచి స్టాక్ ఎక్స్ఛేంజ్ వరకు చర్చించుకుంటాము. సన్యాసులు మీకు తెలీదులే స్వామి!" తదాత్మీయంగా, గర్వంగా అన్నాడా మొగుడు.

"నాకెందుకు తెలీదు నాయనా? కొందరు తమ అభిప్రాయాలు చాలా బాగా వ్రాస్తారు. కానీ కొందరికి మాత్రం నచ్చని వాళ్ళని తిట్టటం కోసం భగవంతుడు ఇరవై సంవత్సరాల క్రితం ఇచ్చిన వరం ఇది!..." అన్నాడు.

"మేధావులంటే ఎవరు స్వామీ?" అంది అతని భార్య అడిగింది.

ఆ ప్రశ్నకి గురువు ఓ కథ చెప్పాడు.

"ఒక గ్రామంలో ముగ్గురు మేధావులు అరుగు మీద కూర్చుని ఉన్నారు. రోడ్డు మీద ఒక పంది, కుక్క కొట్టుకుంటున్నాయి. 'అది ఆడ కుక్క... పంది మొగది!' అన్నాడు ఒకడు.

""కాదు. రెండూ మగవే!..." అన్నాడు పక్కవాడు.



"రెండూ మధ్యస్థం!" అన్నాడు మూడవ వాడు.

మాట మీద మాట పెరిగి ముగ్గురూ దారుణంగా కొట్టుకున్నారు. నగర శాంతిని భగ్నం చేస్తున్న మేధావులు ముగ్గుర్నీ, నిజ నిర్ధారణ కోసం జంతువులతో సహా రాజభటులు బంధించి తీసుకెళ్లారు.

జరిగినదంతా విని...

"ఒక్కొక్కరికి వంద కొరడా దెబ్బలు వేయండి!" అన్నాడు రాజు.

భటులు వాళ్ళని తీసుకుని పోయిన తర్వాత...

మంత్రి వైపు తిరిగి...

"ఎలా ఉంది మంత్రివర్యా నా తీర్పు!? 'దున్నపోతులు' ఆడవా? మొగవా? అని చర్చించుకునే వారికి ఆ శిక్ష సరి అయినదే కదా?" అన్నాడు రాజు.

"నిజమే మహారాజా!" అన్న మంత్రి మనసులో... భటులు తీసుకు వెళ్తున్న జంతువుల్ని చూస్తూ... 'మా రాజుకి గేదెకీ-గాడిదకీ తేడా తెలీదు!' అనుకున్నాడు.

ఈ కథ విని, ఆశ్రమం నుంచి ఇంటికి వెళ్తూ-

"గురువు గారు చెప్పింది అర్థమయిందాండీ?" అడిగింది భార్య.

"పందుల్నీ, కుక్కల్నీ రోడ్ల మీద వదిలేస్తే, ఆ రోజుల్లో రాజులు శిక్షించేవారన్నమాట!" అన్నాడు మొగుడు.

**నీతి:** "ఎవరి అభిప్రాయం ఎక్కువ మందికి నచ్చింది' అన్నదే తప్ప సోషల్ మీడియాలో నిజం ముఖ్యం కాదు."








# పరమేశా! దొంగ విడువు...

వసుంధర- 9885620065

ఎదుటివారికి మర్యాదివ్వడం మంచిదే. కానీ అతిగా ఉండకూడదు. ఎదుటివారిని ఇంప్రెస్ చెయ్యాలనుకోవడం మంచిదే. కానీ అతికి పోకూడదు.

'అతిగా ఆశపడే ఆడది, అతిగా ఆవేశపడే మగాడు సుఖపడినట్లు చరిత్రలో లేదు'- అన్న సినిమా డైలాగు ఆడ, మగలని ఉద్దేశించి కాదు. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్న సూక్తిని కాస్త మార్చి చెప్పింది. ఇది ముప్ఫైఐదేళ్ల క్రితమే నాకు స్వానుభవం.

అప్పుడు నేను ఎమ్మెస్సీ ప్యాసై కొత్తగా రీసెర్చిలో జేరాను. చదువులో పరీక్షలైపోయి... జీవితంలో పరీక్షలింకా మొదలు కాని హుషారు శకమది. అంతో ఇంతో స్కాలరుషిప్పు, టైమింగ్సు లేని రీసెర్చి పని! నేను, మరో ముగ్గురు నాలాంటివాళ్లం కలిసి ఓ మూడు గదుల అద్దింట్లో చిల్లో బొల్లోమంటున్నాం... ఆ చుట్టుపక్కలుండే వాళ్లంతా స్టూడెంట్సు. పరీక్షల బరువుతో కుయ్యో మొర్రో అనుకునే వాళ్లకి మేమంటే కొంత అసూయ... కొంత ఆరాధన!

ఓ రోజు ఇంటాయన మాతో, 'మీరు నలుగురూ రెండు గదుల్లో సద్దుకుని మూడో గదిని ఖాళీగా వదిలేశారు. మీకు కాస్త అద్దె తగ్గిస్తా. అది వేరేవాళ్లకి అద్దెకిస్తే... మీకూ లాభం, నాకూ లాభం' అన్నాడు.


ఆయన లాభంముందు మా లాభం దిగదుడుపని తెలిసినా... ఆట్టే ఆలోచించే వయసా అది! స్వల్ప స్వలాభానికి కక్కుర్తిపడి సరేననేశాం.

అలా ఆ గదిలోకొచ్చాడు పరమేశం, ఎమ్మే లిట్ ఫైనలియర్. పరిచయమైనప్పుడు నేనతడితో, 'రికామీగా లైఫ్ ఎంజాయ్ చేస్తున్న మావల్ల- స్టూడెంటుగా నీకు డిస్టర్బెన్సవుతుంటే నిస్సంకోచంగా చెప్పు' అన్నాను.


అంతే! ఆ మర్నాడు మేము మ్యాట్నీ సినిమా చూసొచ్చి గదిలో జోక్సాడుకుంటుంటే... పరమేశం వచ్చి, 'రేపటికో ఇంపార్టెంట్ అసైన్మెంట్ ఉంది. ప్రిపేరౌతున్నాను. కాస్త నెమ్మదిగా మాట్లాడుకుంటారా?' అన్నాడు వినయంగా.

అతడిలో నిన్నటి మేము కనిపించడంతో- ఆ బాధ అర్థమైంది.

వెంటనే గదికి తాళం పెట్టి దగ్గర్లో ఉన్న పార్కుకెళ్లిపోయాం. కబుర్లన్నీ అక్కడే చెప్పేసుకుని ఇంటికొచ్చేక నిశ్శబ్దంగా ఎవరి గదుల్లో వాళ్లు పడుకున్నాం.








నాకప్పుడు బుష్ రేడియో ఉండేది. అది ఆన్ చెయ్యగానే పలకదు... అందులో మ్యాజిక్ ఐ అనబడే ఆకుపచ్చటి దీపం ప్రకాశవంతం కావాలి. అందుకు రెండు నిముషాలు పడుతుంది. అప్పుడు స్టేషన్ ట్యూన్ చేసుకోవాలి. రోజూ ఉదయం లేవగానే రేడియో సిలోన్లో పాటలు పెట్టుకుని వినడం నాకలవాటు.

ఆ రోజు ఇలా పాటలు పెట్టగానే... అలా వచ్చాడు పరమేశం.

"ఏమనుకోక కొంచెం సౌండు తగ్గిస్తారా?" అన్నాడు.

వాల్యూం తగ్గించి– "చాలా?" అన్నాను.

"ఇంకొంచెం!" అన్నాడు.

అలా తగ్గిస్తూ వెళ్లేక రేడియో ఆన్లో ఉంది కానీ సౌండు నిల్లు. విసుగొచ్చి రేడియో కట్టేసి– ఇకమీదట పరమేశం గదిలో ఉండగా రేడియో పెట్టకూడదనుకున్నాను.

కానీ ఇలాంటివి ఎప్పటికప్పుడే పరగడుపు కదా! మర్నాడుదయం లేవగానే రేడియో స్విచ్ ఆన్ చేసి మ్యాజిక్ ఐ సెట్ కావడానికి ఎదురు చూస్తున్నా. అంతలోనే పరమేశం వచ్చేసి,

"కొంచెం సౌండ్ తగ్గిస్తారా?" అన్నాడు.

తెల్లబోయాను. రేడియో ఇంకా పలకడం మొదలెట్టనేలేదు. అంటే అతగాడికి స్విచ్ ఆన్ చేసిన చప్పుడు వినిపించుండాలి.

ఏమనకుండా, సారీ చెప్పి రేడియో కట్టేశాను. అంతేనా...ఆ రోజునుంచీ రూంలో మాటలు మానేశాం. పాటలు మానేశాం.

మా ఇల్లు మాకు పుస్తకాల్లేని లైబ్రరీలా ఐపోయింది. రాత్రిళ్లు కూడా తొమ్మిదవకుండా మంచాలెక్కేస్తున్నాం.

అలా నాల్రోజులయ్యేక ఓరోజు రాత్రి పదిన్నరకి పరమేశం మా గది తలుపు తడితే మంచి నిద్రలోంచి లేచాను...

చూస్తే పరమేశం! 'మీ గదిలోంచి చిటుక్కుమన్న శబ్దమొచ్చింది. గదిలో నేలమీద చీమలున్నాయేమో చూసుకోండి... ఒకో రకం చీమ కుడితే–ఆ బాధ నాల్రోజులుండొచ్చు!...' అన్నాడు– డిస్టర్బయ్యానంటూనే మాపై కన్సర్న్ కూడా చూపిస్తూ.

లైటేసి చూస్తే ఓ గోడవార నిజంగానే చీమల దండు కనిపించింది. మా రూంమేట్ చేతిలోంచి కిందకు జారిపడ్డ చిన్న చాక్లెట్ ముక్క కోసం వచ్చేయవి. అది సరే కానీ... చిటుక్కుమనకుండా వాటినెలా ఆపగలం?




నా గోడు లేబరేటరీలో ఓ సీనియరుకి చెబితే...

"నువ్వు మరీ అతి మర్యాదకి పోయావు. అది ఒకోసారి సైకలాజికల్ ప్రోబ్లంకి దారి తీస్తుంది... డిస్టర్బ్ ఐతే చెప్పమని మర్యాదకి నువ్వంటే... తను డిస్టర్బ్ అయితే నువ్వు ఇంప్రెస్ ఔతావని పరమేశం అనుకున్నాడు. ఇలాంటివాళ్లకు ఓ విరుగుడుంది. చదువుకి ఏకాగ్రత ఉండాలనీ, ఏకాగ్రత ఉన్నవాళ్లకి చుట్టుపక్కల ఏం జరిగినా తెలియదనీ అతడికి కాస్త గట్టిగానే చెప్పు! మారితే మారొచ్చు..." అన్నాడతడు.

ఆ ట్రిక్కు ఫలించింది. రూంలో మేమిప్పుడు పూర్వమంత గట్టిగా కాకపోయినా ఎంతోకొంత చిల్లోబోల్లోమంటున్నాం.

నేనైతే పరమేశం ఏకాగ్రతని పలుమార్లు అభినందించాను కూడా! బహుశా అదీ అతి అయినట్లుంది– ఆ తర్వాత రెణ్ణెళ్లకి మా రూంలో దొంగలు పడ్డారు. బ్రహ్మచారుల గదిలో పోవడానికేముంటాయ్ కానీ– ఖరీదైన తాళం కప్ప ఒకటి పోయింది. గదుల్లో సామాన్లు చిందరవందరయ్యాయి.

విశేషమేమంటే–ఆ సమయానికి పరమేశం తన గదిలో ఉన్నాడు. మా గదుల్లో జరిగే హడావుడి అతడి చెవుల్లో పడే ఉంటుంది. కానీ తన ఏకాగ్రత విషయమై... నన్ను అతిగా ఇంప్రెస్ చెయ్యాలన్న తాపత్రయం అతణ్ణి, 'పరమేశా! దొంగ విడువు, ఇంప్రెస్ చేయన్' అందేమో మరి!






# తాగినోళ్ళ అందరూ...



సరసి-440542950

**అ**ప్పుడే కొత్తగా చిన్న ఉద్యోగాల్లో చేరాం నేనూ హరీను. సికింద్రాబాదు రెజిమెంటల్ బజార్లో.. వెళుతూనే మంచం మీద కాలు పెట్టాల్సినంత చిన్న గదిలో అద్దెకి దిగేం.


మా పక్కింట్లో ఓ రిటైర్డ్ మిలట్రీ ఆయనుండేవాడు. ఆయనకి రాత్రింపగళ్ళు తాగడమే పని.

ఓ రోజు రాత్రి మా గుమ్మంలో న్యూసెన్స్ చేస్తోంటే మేము గొడవ పడ్డాం. ఆ పళంగా మీదకొచ్చి నన్ను తన్నబోయాడు. ఆ పని ఆయన్ని చేసింది వాళ్ళావిడ ఇంట్లోకి తీసుకెళ్ళి!

'మీ పని చెప్తానొరేయ్. ఒంటరిగా ఎక్కడో దొరక్కపోతాగ్రా.. నా కొడకల్లారా.' క్రూరంగా చూస్తూ అరిచేడాయన బయటికొచ్చి. మా ఇద్దరికీ పిచ్చ భయం పట్టుకుంది అప్పట్నించి... అసలే మిలట్రీ వాడు. పైగా 'నిత్య మందుభాగ్యుడు'!

ఆ రోజు నించి మేమిద్దరం స్నేహితుల్లా కాక కవల పిల్లల్లా కలిసి తిరగసాగేం. ఓ రోజు 'సంగీత్' టాకీసులో 'బెన్‌హర్' సినిమా చూసొస్తున్నాం నడుచుకుంటూ.

రాత్రి తొమ్మిది దాటింది. రోడ్డు మీద జన సంచారం లేదు. 'కీస్ హై స్కూలు' దగ్గర ఫుట్ పాత్ మీద మందు సీసా చేత్తో పట్టుక్కూర్చుని 'జీనా యహా మర్నా యహా' అంటూ గట్టిగా పాడుకుంటున్నాడొకడు. మమ్మల్నిచూసి–"దొరికేగ్రా నా..." అంటూ గట్టిగా హిందీలో ఓ బూతు తిట్టేడు. ఉలిక్కిపడి చూస్తే ఆయనెవరో కాదు మా పక్క మిలట్రీ ఆయనే!



వెంటనే నేలమీంచి ఓ కంకర్రాయిని తీసి మా మీదకి విసిరేడాయన బలంగా. మేము ఆర్తనాదాలు చేస్తూ... వెనక్కి తిరిగి పరుగు లంకించుకున్నాం. ఆ రాయొచ్చి హరి పిర్ర మీద తగిలింది! అసలే మిలట్రీ వాడు. గురి తప్పదుగా! ఆ దెబ్బకి మా 'లోతట్టు ప్రాంతాలు' జలమయమైనంత పనయ్యింది! ఆయన చూపుకి దొరకనంత దూరం వెనక్కి దౌడు తీసి డొక్కలెగిరేలా ఆయాసపడుతూ ఆగేం. ఆయన అక్కడే రాళ్లు పెట్టుక్కూచున్నాడు మాకోసం.

'ఇరుక్కుపోయాంరా దేవుడా! ఆయన్ని దాటి ఇపుడు రూముకెలా చేరుకోవడం? చుట్టుతిరిగి వెళ్ళాలంటే అబ్బో చాలా దూరం...' వర్రీ అవుతోంటే వెనకనించి ఒకాయన్ని పంపించాడు దేవుడు సైకిల్ మీద.

చటుక్కున ఆయన్ని ఆపి, "సార్సార్ అక్కడొకాయనండీ మమ్మల్నండీ కొడుతున్నాడండీ... కాస్తండీ ఆయన్నండీ దాటించండి. ప్లీజండీ!..." అంటూ ఇద్దరం ఏదో కంగాళీ అవకతవకగా ప్రాధేయపడి ఆయనకి అర్థం అయ్యేలోగా నేను ముందు, హరి వెనక ఎక్కేసాం సైకిలు.

ఒక్క క్షణం అయోమయంగా చూసి సైకిల్ పోనిచ్చాడాయన. అంతా డౌను. ఈజీగా తొక్కేసాడు. మేము నడిచొస్తామని చూస్తున్నట్టున్నాడు మిలట్రీ మామ! సైకిల్ని పట్టించుకోలేదు. దాటేసాం! బతికిపోయాం!!

రెజిమెంటల్ బజార్ చేరుకోగానే సైకిల్ ఆపించి దిగేం.

"ఇప్పుడు చెప్పండి" అన్నాడాయన తాపీగా.

"దేవుళ్ళా కాపాడేరు సార్! మా దారిన మేమొస్తూ వుంటే మమ్మల్ని రాళ్ళతో కొడుతున్నాడు సార్...ఆ దుర్మార్గుడు! బాగా తాగున్నాడు!..." అన్నాడు హరి.

దానికి ఆయన 'దేవదాసు'లో అక్కినేనిలా మావంక చూసి "తాగినోళ్ళ అందరూ దుర్మార్గులు కాదు బాబూ!... నేనిప్పుడు ఫుల్లుగా తాగే ఉన్నాను. దుర్మార్గుడినా మరీ!" అన్నాడు చిరునవ్వుతో.







# ఖరీదైన చెప్పులు



గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

**ల**లితని మధు, ఓసారి కింద నుండి పైదాకా చూసి– "అదేవిటీ?... చీర...నగలు గాజులు... వగైరా అన్నీ కొత్తవి వేసుకుని, చెప్పులు మాత్రం చెత్తవి వేసుకున్నావ్! మొన్న అరికాళ్ళు అరిగేలా నన్ను తిప్పితిప్పి... నా ఓపిక పిప్పిపిప్పి చేసి కొన్న ఐదువేల రూపాయాల చెప్పులు ఎక్కడ తగలేసావ్?" అడిగాడు అయోమయంగా చూస్తూ.

"అవి కూడా ఉన్నాయ్!... కానీ నేనే వేసుకోలేదు. క్రితం నెల మీరు కొన్న ఆ నాలుగువేల చెప్పులూ, మన పక్కవీధి పరమేశ్వరిగారమ్మాయి పుట్టినరోజు ఫంక్షన్‌కి వేసుకు వెళ్ళాను. ఇలా వెళ్ళి అలా వచ్చేలోపే వాటినెవరో లేపేశారు. ఎవరి దిష్టో తగిలి, పాపిష్టి దురదృష్టం వెంటాడి, ఇష్టపడి కొనుక్కున్న ఆ చెప్పులు నష్టపోయాను.కష్టంగా అన్పించినా, పోతే పోయాయిలే అని గుండెని గుండ్రాయ్ చేసుకుని, నన్ను నేనే ఓదార్చుకున్నాను. తర్వాత ఆన్‌లైన్‌లో ఆరువేలు పెట్టి కొన్న మరో జత చెప్పులని, అవతలి వీధి ఆండాలమ్మ గారింట్లో చీటీ పాటకి వేసుకెళ్ళాను.... పాట పాడి బయటికి వచ్చి చూస్తే...చెప్పులు మాయమై పోయాయ్...ఆ రెండు జతలూ పోయిన రెండు సార్లూ... భోజనం మానేసి బోరున ఏడ్చాను. అందుకే ఈ గృహ ప్రవేశంకి ఇలా రబ్బర్‌చెప్పులు వేసుకున్నాను. అయినా మీ చాదస్తం కానీ... చీర కింద వరకు ఉంది కదా! చెప్పులు అంతగా కనిపించవులెండి!" చెప్పింది చీరని ఇంకా కిందకి లాగేస్తూ.




"నీ దుంప తెగ! నువ్వు ఎక్కడ తయారయ్యావే.ముందు ఆ చీర కిందకి లాగడం ఆపు!... అసలే మనం వీధిగుమ్మం దగ్గర ఉన్నాం.పైగా ఈ చెప్పుల్లో నీ పాదాలు చూడలేకపోతున్నాను...దయచేసి నా పరువు తీయకు!" చెప్పడంతో, విసుగుతూ లోపలి కెళ్ళి, నసుగుతూ ఆ చెప్పులు వేసుకొచ్చింది. తర్వాత ఇద్దరూ ఆ గృహప్రవేశం ఫంక్షన్‌కి వెళ్ళారు. నడుస్తూ లలిత ఏదో చిన్న ప్లాస్టిక్ కూల్‌డ్రింక్ బాటిల్ పై అడుగువేసి తడబడింది. దాంతో కోపంగా– "ఏయ్ యూజ్ లెస్ ఫెలో ఇట్రా!" అంది అక్కడున్న వాచ్‌మెన్‌ని.

అతను పరుగున రాగానే... "ఏవిటీ ఈ బోటిల్స్, కొంచెం ఉంటే పడిపోయేదాన్ని. ఇవన్నీ తీసి పారేయ్ పో!" చెప్పింది కోపంగా.

"సరే అమ్మగారూ!" అంటూ ఏడుపు మొహం పెట్టుకుని వెళ్ళిపోయాడతను.












"పెద్ద వయసు వాడు... మొగుడ్ని తిట్టినట్టు తిట్టకపోతే, కొంచెం మర్యాదగా చెప్పాల్సింది!" అన్నాడు.

"వాళ్ళకి మర్యాదగా చెబితే అర్థం కాదు... వీళ్ళకి ఇలా చెబితేనే అర్థం అవుతుంది!" చెప్పి టకటకా నడిచి సడెన్‌గా ఆగి పిచ్చిచూపులు చూసింది.

"ఏవిటి అలా సడెన్ బ్రేక్ వేసినట్టు హఠాత్తుగా ఆగిపోయి... దీర్ఘంగా ఎక్కడో ఆలోచిస్తున్నావ్! పద లోనికి వెళదాం!" అన్నాడు.

"ఏవండీ! మరీ... నా చెప్పులు చచ్చినట్టు ఇక్కడ గుమ్మం దగ్గరే వదిలి... లోపలికి వెళ్లాలా?" తన చెప్పుల వంక ప్రేమగా చూసుకుంటూ అంది.

"ఇక్కడే వదిలి వెళ్ళక... ఇంట్లోకి వెళుతూ సంకలో పెట్టుకుని వెళతావా?..." అన్నాడు ముఖం చిట్లిస్తూ.

"సరే ఉండండి! ఒక ఉపాయం ఉంది!..." అని వెళ్ళి... రెండు నిమిషాల్లో నవ్వుతూ వచ్చింది.

"ఏవిటి! చెప్పులు ఎక్కడ పెట్టావ్? టెన్షన్ లేకుండా అంత హాయిగా నవ్వుతున్నావ్?" అడిగాడు.

"అది సీక్రెట్! పదండీ లోనికెళ్ళొచ్చేద్దాం!" అంది ఉత్సాహంగా.

తర్వాత ఇద్దరూ లోపలికెళ్ళి దణ్ణం పెట్టుకుని...వాళ్ళని పలకరించి, బయటికి వచ్చారు. మధు, లలిత వంక చూస్తూ–

"ఇపుడు చెప్పు! నీ చెప్పులు అంత భద్రంగా ఎక్కడ పెట్టావ్?" అడిగాడు ఆశక్తిగా.

"అక్కడ ఓ కవర్‌లో పాత పేపర్లు ఉన్నాయ్. అందులో చెప్పులు పెట్టి... వాటిపై మళ్ళీ ఆ పేపర్లు పెట్టేశాను. దాంతో, అందులో చెప్పు లున్న సంగతి ఎవరికి తెలుస్తుందీ?... ఎవరు తీస్తారు?" అంటూ పకపకా నవ్వి... కవర్ పెట్టిన వైపు చూసింది.

గుండె గుభేలుమంది. అక్కడ పెట్టిన కవర్ లేదు.నవ్వు టక్కున మాయం అయిపోయింది.

చుట్టు పక్కల వెతికి... మళ్ళీ ఆ వాచ్‌మేన్‌ని పిలిచి– "ఇక్కడో తెల్లరంగు ప్లాస్టిక్ కవర్ ఉండాలి... చూశావా?" ఆశగా అడిగింది.

"చూశానమ్మగారూ!" అనడంతో లలిత ఊపిరి పీల్చుకుని "ఎక్కడ పెట్టావ్?" అంది.


"చెత్త తీసుకెళ్లే బండిలో పడేసానమ్మగారూ! మీ కాలికింద పడిన ప్లాస్టిక్ బాటిల్ లాంటి కొన్ని బాటిల్స్ గబగబా ఏరి...ఆ కవర్లో పెట్టి... చెత్తబండి రావడంతో... అందులోకి విసిరేశాను!" బిక్కుబిక్కుమంటూ చెప్పాడు.

"పడేసే ముందు అందులో ఏముందో... చూళ్ళేదా?!" అడిగింది కోపంతో.

"చూశానమ్మగారూ! అందులో పాత పేపర్లున్నాయ్!" చెప్పి అక్కడి నుండి వెళ్లిపోయాడు.

ఆ సమాధానం విన్న లలిత కొయ్యబారి పోతూ...

'ఖరీదైన చెప్పులు నాకచ్చిరావేమో' అనుకుంటూ ఏడుపు మొహం పెట్టుకుని వొట్టి కాళ్లతో ముందుకు నడిచింది.











# అప్డేట్ అప్పారావు


డా.వినోద్ కుమార్ నగరం- 9440924291

**'అ**ప్డేట్ అవ్వండయ్యా'... అప్పటికే ఆ రోజు పదహారోసారి... మా బాస్ అప్పారావు ఆ పదం వాడటం!

"ఎంత కాలం అలా జడ పదార్థాల్లా పడి వుంటారు? జీవితంలో పై స్థాయికి ఎదగడం అన్నది చాల ముఖ్యం ... అలా ఎదగాలంటే మీరు అప్డేట్ కావాలి... అంతే కానీ... చెప్పిన ప్రతి విషయాన్ని అప్పుడే విన్నట్లు మొహం అలా పెట్టకండి! కనీసం నన్ను చూసి నేర్చుకోండి! నేను ప్రతి విషయంలో ఎలా అప్డేట్‌గా ఉంటానో..."

మా బాస్ అప్డేట్ మానియాకి పరాకాష్ట ఏమిటంటే...ఒక ఆఫీస్ అటెండర్ ఆయన ఛాంబర్ డోర్ పుష్ బదులు పుల్ చేసాడని వాడిని నిర్దాక్షిణ్యంగా డిస్మిస్ చేసేసాడు. ఆయన ఛాంబర్ బయట నేమ్ ప్లేట్ పక్కన ఇన్..అవుట్... స్టేటస్ అప్డేట్ చేయలేదని మరో అటెండర్‌ని డిస్మిస్ చేసేసాడు... ఆ మాత్రం అప్డేట్ కాకుండా వాడు ఏమి పని చేస్తాడు అని ఆయన వాదన. అలా రోజూ ఆయన పెట్టే టార్చర్ భరించ లేనంత రేంజ్‌లో ఉంటుంది.

ఇలా ఉండగా ఒక రోజు... మా ఆఫీస్ ఒక పెద్ద ప్రాజెక్ట్ పని మీద నాకు మూడు నెలల అమెరికా టూర్ వెళ్ళవలసి ఆఫర్ వచ్చింది. ఎటొచ్చి నా ప్రయాణం మా బాస్ అప్పారావుతో బాటు ముడి పెట్టారు. నాకు మరో మార్గం లేక... వెళ్ళడానికి మానసికంగా సిద్ధపడి పోయాను... మా బాస్ అప్పారావు హడావిడి ఇక చెప్పనవసరం లేదు... రోజూ నాకు ఒక గంట క్లాస్ పీకుతున్నాడు.



వీసా ఇంటర్వ్యూ ఎలా ఫేస్ చెయ్యాలి అనే దగ్గర్నుండి... ఎయిర్‌పోర్ట్‌లో ఎంటర్ అయినప్పటి నుండి... ఫ్లైట్ దిగేదాకా ఏమేమి చెయ్యాలి?...ఎలా నడుచుకోవాలి? అన్న దాని మీద అప్ టు డేట్ సమాచారం అందిస్తున్నాడు మా అప్డేట్ అప్పారావు.

ప్రయాణం రోజు...

పూర్తి లగేజీతో స్టేషన్‌కి బయలుదేరాం... మరుసటిరోజు హైదరాబాద్ నుండి మా ఫ్లైట్. సమయం గడుస్తోంది...

ట్రైన్ వస్తున్నట్లు స్టేషన్ అనౌన్స్‌మెంట్ వినిపించుకోకుండా అందరు గోల గోలగా మాట్లాడుకుంటున్నారు ...

'శబరి ఎక్స్ ప్రెస్'...అనే మాట మాత్రం మా చెవుల్లోకి వెళ్ళింది...

మా ముందు మెల్లగా ట్రైన్ వచ్చి ఆగింది...


మా స్టాఫ్ మమ్మల్ని జాగ్రత్తగా ఫస్ట్ క్లాస్ బెర్త్ ఎక్కించారు...

ట్రైన్ మెల్లగా బయలుదేరింది.

కేబిన్‌లో మేము ఇద్దరమే వున్నాము...



## ప్రొఫెషనల్ ఫన్




ట్రైన్ అప్పటికే వేగం పుంజుకుంటోంది...

సాధారణంగా అర్థగంట లోపు ట్రైన్ రేణిగుంట ప్లాట్‌ఫార్మ్‌లో ఆగాలి... కానీ ఈ ట్రైన్ ఏ మాత్రం స్లో అయ్యే సూచన కనబడలేదు. అంతకంతకు వేగం పుంజుకుంటోంది...టీసీ కూడా వచ్చే సూచనలు కనిపించలేదు...

నా మనస్సు అప్పటికే ఏదో కీడు శంకించడం మొదలు పెట్టింది..

'రేణిగుంట దగ్గర ట్రైన్ ఆగాలి కదా!' స్వగతంలా అనుకున్నాను.

నా మాటలకు మా బాస్- "ఇది సూపర్ ఫాస్ట్ ట్రైన్ కదా! ఆ స్టేషన్‌లో ఆగదు!" ... అని క్యాజువల్‌గా చెప్పాడు .

మా బాస్ అప్డేట్ పరిజ్ఞానం మీద అపారమైన నమ్మకంతో నేను మౌనంగా తలాడించాను... నీట్‌గా బెడ్‌షీట్స్ సర్దుకొని నిద్రకు ఉపక్రమించాము...

తెల్లవారింది. ట్రైన్ ఏదో స్టేషన్‌లో ఆగింది. వాచ్ లో టైం చూసాను...

ఉదయం 9.30 అవుతోంది...

మెల్లగా ట్రైన్ దిగాను...

స్టేషన్ బయట సైన్‌బోర్డ్స్ మొత్తం తమిళంలో ఉంది.

స్టేషన్ పేరు ఇంగ్లిష్‌లో-కోయంబత్తూరు- అని చదివి షాక్ తిన్నా!... అప్పటికే నాకు విషయం మొత్తం అర్థమయ్యింది.

వెంటనే ట్రైన్‌లోకి వెళ్లి గుర్రు పెట్టి నిద్రపోతున్న మా బాస్‌ని తట్టి లేపాను.

'సార్! కొంప మునిగింది. ఇది త్రివేంద్రం వైపు వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్!... మనము ఎక్కవలసింది హైదరాబాద్ వైపు వెళ్లే ట్రైన్... మనం ట్రైన్ నెంబర్ చూసుకోకుండా ఎక్కేసాము."

అది విన్న బాస్ మొహంలో కత్తి వేటుకు నెత్తురు చుక్క లేదు.

నోరు వెళ్ళబెట్టి చూస్తు న్నాడు...

"ఇప్పుడు ఏమి చెయ్యాలి?!.." తడి ఆరిన గొంతుతో ప్రశ్నించాడు.

విషయం ఏమిటంటే త్రివేంద్రం నుండి, హైదరాబాద్ నుండి వచ్చే శబరి ఎక్స్‌ప్రెస్ ట్రైన్స్ రెండూ తిరుపతి స్టేషన్‌కి ఒకే సమయానికి వస్తాయి... ఆ విషయం మాకు, మా అప్డేట్ అప్పారావుతో సహా ఎవరికీ తెలీదు పైగా అనౌన్స్‌మెంట్ సమయంలో మాటల్లో పడి మేము ఎవ్వరు పట్టించుకోలేదు.

ఇక సీన్ కట్ చేస్తే...

సమయానికి హైదరాబాద్ చేరక పోవడం వలన... మా అమెరికా ప్రయాణం అర్థాంతరంగా ఆగిపోయింది. మాకు ఫ్లైట్ టికెట్ చార్జీలు లాస్.


జరిగిన విషయం మొత్తం తెలుసుకొని 'ఆ మాత్రం అప్డేట్ కాకుండా ఎలా వున్నావయ్యా అప్పారావు?' అని తల వాచేటట్లు చీవాట్లు పెట్టారు మా ఎం.డి.


ఆ తరువాత మా ఆఫీస్‌లో 'అప్డేట్' అనే పదం మేము ఎవ్వరం వినలేదు...

ఎందుకంటే మా అమెరికా ట్రిప్ ఫెయిల్ అవడం వల్ల మా కంపెనీకి కోట్లలో నష్టం వచ్చింది.

ఇంత చిన్న విషయంలో అప్డేట్ కాని మా మా బాస్‌ని, పనిష్మెంట్ కింది అసిస్టెంట్ మేనేజర్‌గా డిమోట్ చేస్తూ... ఒరిస్సా బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫర్ చేసింది మా కంపెనీ.

ఆ విధంగా మా అప్డేట్ అప్పారావు నుండి మా ఆఫీస్ స్టాఫ్‌కి మాత్రం శాశ్వత విముక్తి కలిగింది.








# ఉత్కంఠా మజాకా!

దమ్మవళం శ్రీనివాస్, 9866534340

**యా**భై ఏళ్ళ జగ్గయ్య గత రెండేళ్ళుగా కథలు రాస్తున్నాడు.

తనో అద్భుతమైన రచయితను అని యమ గాఢంగా నమ్ముతాడు. అయితే... అతడి దురదృష్టమో లేక పాఠకుల అదృష్టమో తేల్చి చెప్పడం కష్టం కానీ ఒక్క కథా అచ్చుకు నోచుకోలేదు.

అయినా, బెట్టు వదలని బేతాళుడిలా ఎడాపెడా, ఛడామడా రాస్తూనే ఉన్నాడు.

"అద్భుత కథలు" అని ఓ వాట్సప్ గ్రూపు సృష్టించి, ఎడిటర్లు చిత్తుగా రిజెక్ట్ చేసిన తన కథలని ఆ గ్రూపులోకి రీరిలీజ్ చేయసాగాడు.

గ్రూపులో కొంతమంది మొదట్లోనే ఎగ్జిట్‌కు బుద్ధి చెబితే... మరికొంతమంది భయంతో మెసేజెస్ తెరవడం కూడా మానేసారు.

కొద్దిమంది మాత్రం అతడి రచనలను 'మహాద్భుతం' 'భీభత్సం'... అని అదేపనిగా పొగిడేవారు.

వారంతా అతడి దగ్గర పనిచేసే ఉద్యోగులో లేక చిన్నా చితకా అప్పుచేసేవారో లేక మరో విధంగా అతడితో పని ఉన్నవారే!

ఓ రోజు అలా తన కథను గురించి పొగుడుతూ రాసిన మెసేజెస్ చదువుతూ పులకించిపోతున్న జగ్గయ్యను చూసి అతడి భార్య పంకజాక్షి ...


"ఎందుకండీ ఆ పనికిమాలిన గ్రూపు చూసుకొని సంబరపడటం? మీ పేరుకు తగ్గట్టే మీరు రాసేవన్నీ పాతకాలపు రుబ్బురోలు కథల్లా ఉంటాయి. కొత్తగా ఏదైనా రాయండి అంటే వినరు. ఈమెయిలు చేస్తున్నారు కాబట్టి సరిపోయింది కానీ, లేకపోతే, మీ కథలన్నీ రోజూ తిరిగి పట్టుకు రాలేక పోస్ట్‌మెన్



కూడా ఇంటికొచ్చి భోరుమనేవాడు.” అన్నది.

“అది కాదు జాక్షి!... అసలు నేను పంపే కథలు ఎడిటర్లు ఓపిగ్గా చూడటం లేదని నా డౌటానుమానం... లేకపోతే, ఇంతమంది నా వాట్సప్ గ్రూపులో చేరి నా కథలు అద్భుతం అని మెచ్చుకోవడమేంటి?”

“మీ అద్భుత వాట్సప్ పాఠకులంతా మీతో అవసరం ఉన్నవారే. మిమ్మల్ని ఉబ్బేయడానికి తప్ప వారసలు మీ కథలు చదవను కూడా చదవరని నా అభిప్రాయం... నాకైతే మీరు రాసిన ఒక్క కథ కూడా నచ్చలేదు. ప్రతీ లైనూ ‘ఇక చాల్లే. పక్కన పడేద్దాం’ అనిపించేలా రాయడంలో మీది అందె వేసిన కలం... కథ మంచి సస్పెన్స్‌తో ఉండి పాఠకుల్ని ఉగ్రూత లూగించాలి... మీవన్నీ బోరుతో ఉగ్రూత లూగించే కథలే.” సూటిగా చెప్పేసి అక్కడ నుంచి వెళ్ళిపోయింది పంకజాక్షి.




సోఫాలో... ఆలోచనల్లో కూలబడ్డాడు జగ్గయ్య. ‘తనకి కచ్చితంగా తెలుసు తన పాఠ కులు తన రచనలని అత్యంత నిజాయితీతో పొగుడుతున్నారని. ఈ విషయంలో భార్య నోరు మూయించాలంటే ఈసారి ఓ సస్పెన్స్ కథ రాయాల్సిందే! ప్రతీ లైనూ ఉత్కంఠతో పిచ్చెక్కించేలా ఉండాలి...’ ఇలా అనుకొని, అదే పనిగా శ్రమించి మొత్తానికి ఓ కథను మూడు రోజుల్లో పూర్తిచేసాడు.

“ఇదిగో జాక్షి! ఇలా రా!!... సస్పెన్స్ కథ రాయమంటావుగా! రాసేసాను–పేరు ‘ఉత్కంఠ హత్య’. ఇప్పుడే దీన్ని పోస్ట్ చేసి అందరి అభిప్రాయం అడుగుతాను చూడు. ఇందులో వచ్చే చివరి ట్విస్ట్ కి ఒక్కొక్కరూ దిమ్మదిరిగి ఏమంటారో చూడు.” ఫోన్లో తన కథను భార్యకు చూపిస్తూ చెప్పాడు జగ్గయ్య గర్వంగా.

“అలాగే చూస్తాను కానీ, నేను చెప్పినట్టు రాయండి.” అని ఏం చేయాలో చెప్పింది.

పగలబడి నవ్వి... “మిత్రులారా! ఈసారి యమ సస్పెన్స్ కథ రాసాను... చదివి మీ అభిప్రాయాలు యమ నిజాయితీగా చెప్పండి.” అని భార్య చెప్పినట్టుగా కథను గ్రూపులో పోస్ట్ చేసాడు జగ్గయ్య.

తన అభిమాన పాఠకుల స్పందన కోసం ఉత్కంఠగా చూడసాగాడు జగ్గయ్య.

పంకజాక్షి కూడా భర్త పక్కనే కూర్చొని ఫోన్ వైపు సరదాగా చూడసాగింది.

కథ పంపిన పదిహేను నిమిషాల తర్వాత, స్పందనలు వెల్లువెత్తినై...

“ఇది అద్భుతం కాదు. అంతకు మించి! చివరి ట్విస్ట్ పేలిపోయింది!”

“అదేమి సస్పెన్స్ అండీ బాబు... వెర్రెక్కి పోయింది. మీకు నా జోహార్లు!”

“సర్!... మీ ఇంటి పేరు మల్లాదో... యండమూరో... అని మార్చుకోవాలేమో ఇక!”

“వావ్! ఉత్కంఠ భరించలేక చచ్చిపోదామని పించింది! చివరి ట్విస్ట్ తెలిసాక ఎంతో శాంతి కలిగింది.”


అన్నీ ఇలాంటివే.

మరికాసేపు చూసి, జేవురించిన మొహంతో కసిగా... విరక్తిగా... బాధగా... ఉన్నపళంగా వాట్సప్ గ్రూపు డిలీట్ చేసేసాడు జగ్గయ్య!

పకపకా నవ్వుతూండిపోయింది పంకజాక్షి.

జరిగిందేంటంటే... ‘ఉత్కంఠ హత్య’ కథ చివరి పేజీని తొలగించి... కావాలనే అసం పూర్ణంగా పంపాడు జగ్గయ్య.

అలా చేయమని చెప్పి, ఎంతమంది ఆ విషయం కనుక్కుంటారో చూడమని సలహా ఇచ్చింది తెలివైన పంకజాక్షి.








# ఓ రచయిత ప్రస్థానం

పి.వి.రామశర్మ, 9490244344

ఇటీవలే పదవీవిరమణ చేసిన సుందరానికి ఇప్పుడు ఖాళీదొరకడంతో ఎప్పటినుండో ఉన్న కథలు వ్రాయాలి అన్న కోరిక ఇప్పుడు తీర్చుకుందాం అనుకుని, ఓ శుభముహూర్తాన గణపతికి దండం పెట్టుకుని కథారచనకు ఉపక్రమించాడు.

అయితే అది అంతసులువుగా అనిపించలేదు.

కథ చదివినంత సులువుకాదు, వ్రాయడం అని అర్థమైంది.

అప్పటికీ, కొందరి కథలుచదివి, ఆయా కథల్లో అక్కడోముక్కా, ఇక్కడోముక్కా పట్టుకొచ్చి కాపీ పేస్ట్ లాంటి కొన్ని కథలు వ్రాసి కొన్ని పత్రికలకు మెయిల్ చేశాడు.

అవి, "తన యజమాని విసిరినబంతిని పరిగెత్తుకెళ్లి నోటకరిచి మళ్ళీ యజమానికి అందించే పామేరియన్ డాగ్" ఆడే ఆటలా తిరస్కరణ రిప్లై మెయిల్ వెంటనే వచ్చేసేది.

కొందరైతే "ఇలాంటి పిచ్చి కథను తిరస్కరిస్తున్నందుకు సంతోషిస్తున్నాం!" అని సమాధానం ఇచ్చేవారు.

దాంతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్ లా ఎప్పుడూ కుమిలిపోతూనే ఉండేవాడు.

భర్త సర్వీస్ లో ఉన్నప్పుడే సీరియల్స్ పిచ్చిలో పడి అతన్ని పట్టించుకోని, సుందరం భార్య జగదాంబ ఇప్పుడు అతను రిటైరయ్యాక పూర్తిగా పట్టించుకోవడం మానేసి, ఎప్పటిలాగే సీరియల్స్‌లో తలమునకలవుతోంది. ఎప్పటిలాగే ఆరోజు కూడా తను వ్రాసి పంపినకథలు మెయిల్లో తిరిగొచ్చేసరికి ఏడుపుమొహంతో హాల్లోకొచ్చి... అక్కడ గోళ్ళు కొరికేసుకుంటూ 'గోరింట పూలు' సీరియల్ సీరియస్‌గా చూస్తున్న భార్య పక్కన కూలబడ్డాడు.

సీరియల్ లో నిమగ్నమైన జగదాంబ, ఆ సీరియల్ ప్రకటన టైమ్‌లో పక్కనున్న భర్తను చూసి ఉలిక్కిపడి– దొంగాదొంగా అని అరవబోయి... అతన్ని భర్తగా పోల్చుకుని... "మీరేంటీ! ఈ టైములో ఇక్కడా? టీవీలో సీరియల్ వస్తుంటే అసహనంగా గదిలోకి పోయి తలుపులు బిడాయించుకునే



ఈ మొహానికి ఇవాళేమైందీ!... ఒంట్లో బాలేదా!?" అనడిగింది.

"బానే ఉన్నాగానీ! కొంచెం కాఫీ..." అని అడిగి, క్రూరంగా చూస్తున్న భార్యమొహం చూసి– "అహ! వద్దులే!" అన్నాడు రిమోట్ అందుకుంటూ.

"అలా రండి దారికి!" అనుకుని, అంతలోనే భర్త రిమోట్ తీసుకోవడం చూసి... 'అమ్మో! ఛానెల్ మార్చేస్తాడేమో ఈయన!' అనుకుంటూ... "సీరియల్ మాంచి ట్విస్టులో ఉంది... ఛానెల్ మార్చొద్దు!" అని వెంటనే విసురుగా రిమోట్ లాగేసుకుంది అతని చేతిలోంచి.

"అంత ట్విస్టా! ఏంటది?" అనడిగాడు కుతూహలంగా.


భర్త సీరియల్స్ పట్ల ఈమాత్రం ఆసక్తి చూపడమే మహద్భాగ్యంగా భావించి...

"తర్వాత చెప్తానుగానీ, మీకిష్టమైతే సైలెంట్‌గా చూడండి లేదా మీ గదిలోకిపొండి!" అని చెప్పింది జగదాంబ.

అసలే చిరాకుగా ఉన్న సుందరం ఇంక గదిలోకిపోయినా... ఏమీ వ్రాసే మూడ్ లేక, అలా అక్కడే ఉండిపోయి... యాడ్స్ తర్వాత మళ్ళీ మొదలైన ఆ సీరియల్ చూడసాగాడు.

అయిదు నిమిషాలు ఆ సీరియల్ సాగిందో లేదో మళ్ళీ ప్రకటనలు... ఈలోగా ఇంకో చానెల్‌లోని 'మహమ్మారి' సీరియల్‌కి మారింది జగదాంబ.

చేసేదేమీలేక అలా ఆవిడ ఎన్ని ఛానెల్స్ మారుస్తూ ఎన్ని సీరియల్స్ చూస్తోందో గమనించసాగాడు.




ఇంకో రెండు గంటలకి...

"ఈ పూటకిఇంతే! మళ్ళీ సాయంత్రం, మందాకిని పాతిన మందార చెట్టు, నీపెళ్ళామే నాప్రేయసి, మొగలిపొదలు, పసుపులేని పారాణి, తొడిమలేనిపువ్వు సీరియల్స్ మొదలవుతాయి. చూస్తారా అవికూడా?" అనడిగింది జగదాంబ ఆశగా.

"భర్తకి ఈ సీరియల్స్ ఏవో నచ్చి ఇలా తనతో పాటే చూస్తూ కూర్చుంటే చాలు ఇంకే పని చెయ్యక్కర్లా!... హాయిగా ఏ స్విగ్గీలోనో, జుమాటోలోనో ఆర్డర్లు పెట్టుకుని కావల్సిన తిండి తెప్పించుకోవచ్చు" అన్న ఆమె మదిలో ఊహలు కుజ గ్రహందాకా వెళ్లిపోయాయి.

"ఇప్పటిదాకా ఓ పది సీరియల్స్ చూపించావు. ఇంకానా!? చాలు. ఎలా భరిస్తున్నావో కానీ!?" అని చిరాగ్గా తన గదిలోకి మళ్ళీ వెళ్లిపోయాడు సుందరం.


కుజదోషం పట్టిన దాన్లా మళ్ళీ ఈ లోకంలోకి వచ్చి, "ఏం మనిషో ఏమో! ఒక్క సీరియల్ ముచ్చటా లేదూ, ఓటిటీ ముచ్చటాలేదూ!" అని మొగుణ్ణి విసుక్కుంది, చేతిలో రిమోట్ పిసుక్కుంటూ.

ఓ సంవత్సరం గడిచిపోయింది.

ఇప్పుడు సుందరం పెద్దపేరున్న రచయిత.

జరిగిందేమిటంటే...

ఏడాది క్రితం విసుగుతో టీవీముందు కూలబడి భార్యచూస్తున్న టీవీ సీరియల్స్ చూస్తూ గడిపిన సుందరానికి హటాత్తుగా తను రచయిత అవడానికి కావాల్సినదేదో దొరికినట్లనిపించిది. ఉదాత్తమైన, సందేశాత్మకమైన రచనలు చేద్దామనే తాపత్రయానికి పోకుండా, అంతదాకా తాను చూసిన టీవీ సీరియల్స్‌లో కొన్నిసంభాషణల ఆధారంగా కొత్తరకం కుట్ర–కుతంత్రాలు, వాటికితగ్గ తిట్లు, శాపనార్థాలు లాంటి సంభాషణలు తయారుచేసి ఓ టీవీ అధినేతను కలిశాడు.




అంతే! అతని దశ తిరిగి, ఇష్టం వచ్చినట్టు కథ లేని సంభాషణలు పొడిగించుకుంటూ, వేలకొద్దీ ఎపిసోడ్లు వ్రాసే తీరికే లేని టీవీ సీరియల్స్ రచయిత అయిపోయాడు.

త్వరలో అతను ఉత్తమ టీవీసీరియల్స్ రచయితగా నందిఅవార్డ్ కూడా అందుకోనున్నాడు.








# తెలియదు...మర్చిపోయా...గుర్తు లేదు...



కోనే నాగ వెంకట ఆంజనేయులు-9290660220

తెల్లటి వేస్ట్ కోటు సవరించుకుంటూ తన భవనంలోంచి బయటికి వచ్చి హడావిడిగా కారెక్కి మీటింగ్ కి బయలు దేరబోతున్న మంత్రిగారి వాహనానికి చెట్టు చాటు నుండి పరుగున వచ్చి అడ్డు పడ్డాడు టీవీ విలేఖరి తన కెమెరా సరంజామాతో.

ప్రెస్ ముందు ఎవరైనా తల ఒగ్గాలనే నియమం గుర్తెరిగిన మంత్రి గారు వెనక సీటు కిటికీ డోర్ తెరిచి తల ముందుకు పెట్టేరు... మనసులోని చిరాకును కృత్రిమ నవ్వు వెనుక దాచేస్తూ.

"సార్ మంత్రి గారూ! ఈ మధ్యన మీ పై అనేక అభియోగాలు వచ్చిన విషయం అందరికీ తెలిసిందే. మీ రాజకీయ జీవితానికి మచ్చ తెచ్చిన ఆ అభియోగాలపై మీ స్పందన ఏమిటో కాస్త ప్రజలకు తెలియ జేస్తారా?" మైక్ మంత్రిగారి నోట్లో దూరుస్తూ ప్రశ్నించాడు ఆ టీవీ విలేఖరి.

"నాకు యిప్పుడు అంత సమయం లేదు... అర్జంటుగా పార్టీ మీటింగ్‌కి వెళుతున్నాను. అయినా మీరు నన్ను ఏ ప్రశ్న అడిగినా దానికి నా సమాధానం 'తెలియదు'... 'మర్చిపోయా'... 'గుర్తు లేదు'... వీటిలో ఒకటి అవుతుంది. అంతకు మించి ఏ సమాధానమూ నా నుంచి మీరు రాబట్టలేరు" చెప్పేరు మంత్రిగారు పూర్తి స్పృహలో ఉండి.

"అదెలా సార్? ముందు మా ప్రశ్నలు విని వాటికి తగిన సమాధానాలు కదా మీరు చెప్పవలసింది?" అన్నాడు విలేఖరి.

"అంత అవసరం లేదు. మీరు ఏం అడిగినా నా సమాధానాలు అవే!.. కావాలంటే రెండు నిముషాలు సమయం కేటాయిస్తా. తెలియదు... మర్చిపోయా... గుర్తు లేదు ... ఈ సమాధానాలతో నా క్లోజప్ వీడియోలు కొన్ని తీసుకుని మీ ప్రశ్నల తరువాత ఎడిటింగ్‌లో అవి కలుపుకుని మీ టీవీ లో ప్రసారం చేసుకోండి... నాకే అభ్యంతరం లేదు!" చెప్పేరు మంత్రిగారు తప్పనిసరై కారు దిగుతూ.

అదే మహా భాగ్యం అని తలచిన ఆ టీవీ విలేఖరి రెండే రెండు నిముషాల్లో మంత్రిగారి నోటితో– 'తెలియదు... మర్చిపోయా... గుర్తు




లేదు' ... అన్న మాటలతో వివిధ భంగిమలతో చిన్న చిన్న వీడియోలు కొన్ని తీసుకున్నాడు. మంత్రిగారి సహకారానికి కృతజ్ఞతలు తెలియ జేసిన టీవీ బృందం తమ సరంజామా సర్దుకుని అక్కడి నుంచి బిచాణా ఎత్తేసింది.

మంత్రిగారి కారు పారిపోయింది.

ఆ రాత్రి టీవీ లో ప్రపంచ వ్యాప్తంగా 'తన మీద వచ్చిన అభియోగాలపై మంత్రిగారి స్పందన' అంటూ... అట్టహాసంగా వారి ఇంటర్వ్యూ ప్రసారమవుతోంది.

అక్కడ లేని మంత్రిగారిని ఉద్దేశించి ప్రశ్నలు సందిస్తున్నాడు టీవీ విలేఖరి.




"మంత్రి గారూ! ఇటీవల మద్యం కేసులో కోట్లాది రూపాయలు చేతులు మారి చివరికి మీ చేతికి చేరేయని... ప్రతిపక్షాలు మీ మీద అభియోగం మోపేయి. ఆ కోట్లాది రూపాయలను చివరిగా మీ వద్దకు చేర్చిన వారి పేర్లు చెప్పగలరా?" విలేఖరి ప్రశ్న దూసుకొచ్చింది.

"నాకు తెలియదు!" మంత్రి గారి రెడీమేడ్ సమాధానం.

"బ్రేకింగ్ న్యూస్ – మద్యం కేసులో అనేక చేతులు మారి కోట్లాది రూపాయలు... తనకు చేరిన మాట నిజమే గానీ ఆ సొమ్ము తనకు చేర్చిన ఆ చేతులు ఎవరివి అన్న విషయం తనకు తెలియదు అని ఒప్పుకున్న మంత్రి గారు!" గొంతు పెంచి చెప్పేడు విలేఖరి.

"మీ పై మరో అభియోగం సర్! అక్రమంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ భూముల వ్యవహారంలో మీకు కొన్ని వేల కోట్ల రూపాయల ముడుపులు అందేయని మీపై మరో అభియోగం. అవి ఎన్ని వేల కోట్లో... చెబుతారా సార్?" మరో ప్రశ్న సంధించాడు విలేఖరి.

"గుర్తు లేదు!..." క్లోజప్‌లో మంత్రిగారి ముఖం.

"బ్రేకింగ్ న్యూస్–అక్రమంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ భూముల వ్యవహారంలో తాను కొన్ని వేల కోట్ల రూపాయల ముడుపులు తీసుకున్న మాట వాస్తవమే కానీ అది ఎన్ని కోట్లో గుర్తు లేదని చెప్పిన మంత్రి గారు!" వాల్యూం మరి కాస్త పెంచేడు విలేఖరి.

"చివరగా మరో ప్రశ్న మంత్రి గారూ! మీరు అక్రమంగా అనేక నగరాల్లో పదుల సంఖ్యలో ఆకాశ హర్మ్యాలు నిర్మించి అద్దెలకు ఇచ్చినట్లు మీపై అభియోగం ఉంది కదా!... అవి ఏ ఏ నగరాల్లోనో చెప్పగలరా?" కుతూహలంగా అడిగేడు విలేఖరి.


"మర్చిపోయా!" నొక్కి వక్కాణిస్తున్న మంత్రి గారు.


"మరో బ్రేకింగ్ న్యూస్ – తాను దేశంలోని అనేక నగరాల్లో అక్రమంగా అనేక... ఆకాశ హర్మ్యాలు నిర్మించి అద్దెలకు యిచ్చిన మాట సత్యమే గానీ... ఆ కట్టడాలు ఏ ఏ నగరాల్లో నిర్మించింది మర్చిపోయినట్లు విన్నవించిన మంత్రి గారు!" అంటూ ఆ విలేఖరి మంత్రి గారితో తన ఇంటర్వ్యూ ముగించాడు.

తనపై మోపబడిన అభియోగాలన్నీ నిజమే అని టీవీ ఇంటర్వ్యూ ద్వారా బహిరంగంగా తెలియజేసిన మంత్రి గారిని ఆ రోజు అర్ధరాత్రి సమయంలో కస్టడీలోకి తీసుకున్నారు పోలీసులు.

మరునాడు అన్ని న్యూస్ పేపర్లలో మొదటి పేజీల్లో యిదే ప్రధాన వార్త అయింది.

అది చదివి భోరు భోరున విలపించారు ఆ భస్మాసుర మంత్రివర్యులు కారాగారంలో.








# కోడలు పిల్ల

అభిమన్యు-9440204748

**శాం**తమ్మ కోడల్ని చూసి మురిసిపోతుంటాది... కోడలు అందంగా ఉంటాది... దానికి తోడు నెమ్మది. అత్త అంటే గౌరవం, భయం కూడాను. ఇంటిపని, వంటపని తనే చేసుకుపోతుంటాది ఓపికగా.

అయితే ఈమధ్య కోడలుకి సరిగ్గా 11 గంటలకి ఫోను వస్తాది. ఆ ఫోన్లో ఆమె నవ్వుతూ మాట్లాడుతాది. మధ్య మధ్యలో "అలాగేనండి... చెప్తానండి..." అని నవ్వుతూ మాట్లాడుతాది. అవతలి వ్యక్తి 'ఎవరో... ఏమో...' ఏదో అనుమానం శాంతమ్మను స్థిరంగా ఉండనీయడం లేదు. ఇదే విషయం భర్తతో చెప్పింది.

"నోర్ముయ్యవే... మన కోడలు పిల్ల బంగారమే... బంగారం. ఇలా ఆలోచించడానికి నీకు మనస్సెలా వచ్చింది...! ఓహో! అత్తవి కదా ఎంతైనా. ఈ అత్తల బుద్ధులు మారవు..." అని కసురుకున్నాడు సదరు శాంతమ్మ భర్త. భర్త మందలించినా శాంతమ్మ మనసు కుదుటపడలేదు. సరికదా కుతకుతమని ఉడికిపోతుంది... కోడలు పిల్ల నవ్వుతూ ఇల్లంతా కలియ తిరుగుతుంటే శాంతమ్మకి ఒళ్ళు మండిపోతుంది.

కొడుకు ఉద్యోగరీత్యా ఉదయం వెళ్ళిపోతే రాత్రికిగాని రాడు... ఇక్కడ కోడలేమో ఫోన్లో 'ఇక ఇకలు... పకపకలు...' ఫోను రింగ్ అయితే చాలు... శాంతమ్మ చెవులు నిక్కబొడుచుకుంటాయి.

శాంతమ్మ ఆగలేకపోయింది. ఆమె మనసు కుత కుతలాడిపోతుంది. కోడలి నిర్వాకానికి భర్తను, కొడుకుని కూర్చోబెట్టి కోడలి మీద ఫిర్యాదు చేసింది.

ఆమె చెప్పింది విని కొడుకు ఏ ఫీలింగ్స్ లేకుండా... నిదానంగా కూర్చున్నాడు. ఎందుకంటే భార్య మనస్తత్వం తనకు తెలుసు కాబట్టి.

"సర్లేవే... ఎందుకలా అయిపోతావు! నేను కోడల్ని పిలిచి అడుగు తానుగా!" అని కోడల్ని పిలిచాడు భర్త బ్రహ్మానందం.

"ఏంటి మామయ్యగారు పిలిచారు!" అంటూ వచ్చింది శ్రీదేవి.

"ఏందమ్మా! నీకు ఏవేవో ఫోన్లు వస్తున్నాయట! ఆ ఫోన్లో నువ్వు పగలబడి నవ్వుతున్నావట! అని మీ అత్తయ్య అంటుంది."

"ఫోను అన్నాక ఫోన్లు రావా మామయ్యగారు? వస్తే మా ఇంటి నుంచి వస్తాయి... లేకపోతే నా ఫ్రెండ్స్ చేస్తారు!" అంది శ్రీదేవి.


"మాట్లాడొద్దు అనడం లేదమ్మా! రోజూ పదకొండు గంటలకి ఫోను వస్తుందట. ఆ ఫోన్లో నువ్వు నవ్వుతూ మాట్లాడుతున్నావట... అని మీ అత్తయ్య అంటుంది!" అన్నాడు బ్రహ్మానందం.

"ఓ అదా!..." అని నసిగింది శ్రీదేవి.

"ఆc! అదే చెప్పు..." అని గద్దించింది శాంతమ్మ.

"మరి... మరి... మొన్నా మధ్య అత్తయ్యగారిని ఆరోగ్యం సరిగ్గా లేకపోతే హాస్పిటల్లో జాయిన్ చేసాం కదా!... అప్పుడు అత్తయ్యగారు డాక్టరుగారితో 'నేను చనిపోతే పాతికలక్షలు ఇన్సూరెన్స్ సొమ్ము వస్తాది. అందులో సగం మీ హాస్పిటల్‌కి రాసిచ్చేస్తాను.' అన్నారట. 'అప్పట్నుంచి డాక్టర్‌గారు రోజూ ఫోన్ చేసి, మీ అత్తయ్యగారు ఎలా ఉన్నారు? చనిపోతే నాకు చెప్పండి.' అని అడుగుతున్నారు." అంది శ్రీదేవి.

అంతే! సోఫాలో కూర్చున్న శాంతమ్మ బిర్ర బిగుసుకుపోయింది.








# కొత్త ఉద్యోగం



తాత మోహనకృష్ణ- 9160045698

అనిల్‌కు కొత్తగా చీరల షాప్‌లో సేల్స్ మాన్ గా జాబ్ వచ్చింది. రాక రాక వచ్చిన ఉద్యోగం అవడం చేత ఎంతో ఆనందం కలిగింది. చీరల షాప్‌లో బాగా అనుభవం ఉన్న తన ఫ్రెండ్‌ని కలుద్దామని వెళ్ళాడు.

"హాయ్ అనిల్..! ఎలా ఉన్నావు?"

"హాయ్ రా!..."

"నాకు చీరల షాప్‌లో సేల్స్‌మాన్‌గా జాబ్ వచ్చింది.... నీకు తెలిసిన విషయాలు చెబితే.. నాకు ఉపయోగపడతాయని వచ్చాను."

"బాగా ఓర్పు, నేర్పు ఉంటే, చీరల షాప్‌లో పని చెయ్యడం పెద్ద కష్టమేమీ కాదు. ఇంతకీ నీకు ఏం వచ్చు?

"చిన్నప్పుడు నేను మా ఇంట్లో ఉతికి ఆరేసిన చీరలు బాగా మడత పెట్టేవాడినని... మా అమ్మ తెగ మెచ్చుకునేది... అదే నాకు ఇన్స్పిరేషన్... ఇప్పుడు నాకు ఆ విద్య బాగా ఉపయోగపడుతుందని నేను అనుకోలేదు."

"సంతోషం గానీ...! నేను కొన్ని ముఖ్య విషయాలు చెబుతాను...విను!"

"ఆడవారు సింగిల్‌గా కాకుండా...ఎవరినో వెంట బెట్టుకుని షాప్‌కు వస్తారు... షాపింగ్‌లో ఇద్దరి టేస్ట్‌లు మ్యాచ్ కావు. కలర్ బాగుంటే, డిజైన్ బాగోదంటారు. డిజైన్ బాగుంటే, బోర్డర్ అంతగా లేదని కొట్టి పడేస్తారు. ఎన్ని చీరలు కొంటారో తెలియదు కానీ..మొత్తం చీరలన్నీ చూపించమంటారు. దూరం నుంచి బాగానే ఉంది..ఓపెన్ చేస్తే అంతగా లేదని వాటిని పక్కన పడేస్తారు.

మొగుడితో వస్తే, పాపం ఆ మగాడి తిప్పలు చూడాలి. చీర స్పెల్లింగ్ కూడా తెలియని ఆ మగాడు ఏం చేస్తాడు పెళ్ళాం గంటల తరబడి చీరలు చూస్తూ ఉంటే?... ఏం చెయ్యాలో తెలియక కునుకు పాట్లు పడుతూ ఉంటాడు... ఎందుకు వచ్చాను రా?... అని తనని తాను



తిట్టుకోని మగాడు ఉండడు.

ఎవరు కొనడానికి వస్తారో, ఎవరు ఊరికే టైం పాస్‌కి వస్తారో మనకి ముందే తెలిసే అనుభవం ఉండాలి. ఎందుకంటే, బయట ఎండగా ఉందనో, వాన పడుతున్నాదనో, ఏసీ కోసం, ఇంకేదో కారణం చేత షాప్ లోపలికి వచ్చి చీరలన్నీ తీయించి టైం పాస్ చేసేవారూ ఉంటారు. వాళ్ళు వెళ్ళిన తర్వాత అన్నీ సర్దు కోవాలి...నీ సరదా తీరిపోతుంది లే!"

"చీరలు సర్దుకోవడం నాకు పర్వాలేదు... వాటిని ఎలా కొనిపించాలో కాస్త టిప్స్ ఇవ్వు!"


"ఆడవారి చేత చీరలు కొనిపించాలంటే, వారిని మెప్పించే విధంగా గొప్పగా మాట్లా డాలి. వారిని పొగడాలి...మీ టేస్ట్ సూపర్ మేడం... మీకిది చాలా బాగుంటుందని, అవ సరమైతే అబద్ధం చెప్పైన వాళ్ళకి చీరలు అంటగట్టాలి. మీ ఒక్కరు బట్టలు కొనుక్కుంటే ఎలా? మీ ఆయనకి కూడా తీసుకోండి... ఇద్దరు చక్కగా ఫొటో తీసుకుని అప్లోడ్ చేసుకో వచ్చు. బోలెడన్ని లైకులు వస్తాయి అనాలి. అంతే! అవసరం లేకపోయినా... ఎంతైనా కొనేస్తారు.

చీరలు కొనడానికి వచ్చిన వారికి, వాటికి మ్యాచింగ్ అన్నీ కొనిపించేయాలి...అదీ షాప్ ఓనర్ నీ టాలెంట్ కంట పడేలాగా! నీకు పక్కా ఇంక్రిమెంట్!

ఇంకా మొన్నే కొత్తగా స్టాక్ వచ్చిందని అంటే చాలు...వారి మనసు అటు పక్క పోతుంది. ఈ చీర ఫలానా హీరోయిన్ కట్టింది అంటే చాలు... అసలు ఇంకేమీ ఆలోచించ కుండా కొనేస్తారు.

ఒక్కమాటలో చెప్పాలంటే, ఎన్ని అబద్ధాలైన ఆడి ఒక పెళ్ళి చెయ్యాలన్నది ఓల్డ్ డైలాగ్!.. ఒక్క చీర అమ్మడానికి ఎన్ని అబద్ధాలు ఆడినా పర్వాలేదనేది కొత్త డైలాగ్!...

వంద చీరలు మడత పెట్టిన పర్వాలేదు... ఒక్క చీరైనా కొనిపించాలి! అదే టాలెంట్! మొత్తానికి చీరలు కొనిపించేయాలి... కొన్న తర్వాత వారు కట్టుకున్నా, లేకపోయినా... ఎన్నిసార్లు కట్టుకున్నా మనకి అనవసరం.. కొనిపించడమే మన పని!" అని ముగించాడు.





శ్రీ ఎ.వి. కృష్ణమూర్తి గారి సౌజన్యంతో హాస్యానందం నిర్వహించిన ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం!

వేదిక: ఎల్.వి.ప్రసాద్ ల్యాబ్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్

తేదీ జూన్,28-2026

సమయం సాయంకాలం 5గంటలకు




గాంధీ మనోహర్- 98490 51846

## జాతకం తో జాగ్రత్త !

**'ఇదివరకు నాకు జ్యోష్యాలు, జాతకాలు అంటే నమ్మకం వుండేది కాదు. కానీ ఈ మధ్య నా ఫ్రెండ్స్ వాటివల్ల జరిగిన నిజాలు, అద్భుతాలు చెబుతుంటే నాకూ నమ్మకం కుదురు తోంది. అందుకని ఓ జ్యోతిష్కుడి దగ్గర నా జాతకం చెప్పించు కున్నాను. అయన ఓ విషయం చెప్పాడు. నా బర్త్ డే రోజు నేను ఏదైనా గుడికి వెళ్ళాలట. అక్కడ ఎవరైతే ఓ పెళ్లి కాని అమ్మాయి నన్ను పలకరిస్తే నేను ఆ అమ్మాయినే పెళ్లి చేసుకోవాలట... నేను అలా చేస్తే భవిష్యత్తులో నా జీవితం మహాద్భు తంగా ఉంటుందట... ఇది నమ్మమంటారా?' అని సోంబాబు చాట్ జీపీటీని అడిగాడు.**

'జ్యోతిష్యం అనేది మన సంస్కృతిలో చాలా కాలంగా వున్నది. చాలా మందికి అది ఓ మార్గదర్శకంగా పనిచేస్తుంది.కానీ ఇలా ఒక స్పెసిపిక్ ఈవెంట్ 'బర్త్ డే రోజు గుడికి వెళ్లి ఎవరైనా అమ్మాయి మాట్లాడితే ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటే లైఫ్ అద్భుతంగా వుంటుంది' అనే ప్రిడిక్షన్ ఎక్కువగా కో ఇన్సిడెన్స్ మీద ఆధారపడివుంటుంది. కాబట్టి నీకు జ్యోతిష్యం మీద నమ్మకం వుంటే ఆ జ్యోతిష్కుడు చెప్పింది ఫాలో అయిపో... అంతే గానీ దీంట్లో నన్ను ఇన్వాల్వ్ చేసి నా పరువు తీయొద్దు' అని చెప్పి తప్పించుకుంది చాట్ జీపీటీ.

సోంబాబు ఆ జ్యోతిష్కుడు చెప్పిందే చేయాలని నిర్ణయించుకున్నాడు.


సోంబాబు బర్త్ డే రానే వచ్చింది. ఆ రోజు తలారా స్నానం చేసి మంచి బట్టలు వేసుకుని తన ఇంటికి దగ్గర్లో వున్న ఓ గుడికి వెళ్ళీ దేవుడికి దణ్ణం పెట్టుకుని ఒకచోట కూర్చున్నాడు.

గుళ్ళోకి చాలా మంది భక్తురాళ్లు వస్తున్నారు...వెళుతున్నారు. సోంబాబుని ఎవరూ పలకరించడం లేదు... గుడి మూసే టైం అవుతుండగా ఓ అమ్మాయి వచ్చి సోంబాబుతో- "ఎక్స్ క్యూజ్మీ! కొబ్బరి కాయలు ఎక్కడ కొడతారు?" అని కొబ్బరి కాయని చేతిలో పట్టుకుని అడిగింది.

సోంబాబు చెప్పాడు. ఆ అమ్మాయి థ్యాంక్స్ చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయింది. సోంబాబు ఆ అమ్మాయినే ఫాలో అయ్యాడు... ఆ అమ్మాయి గుడి నుండి బయటికి వెళ్తుండగా...ఆమెని ఓ ఫ్రెండ్ పేరు పెట్టి పిలిచింది. అప్పుడు ఆ అమ్మాయి పేరు శైలజ అని సోంబాబుకు తెల్సింది. శైలజ తన బైక్ మీద వెళ్తుంటే ఆమెని సోంబాబు ఫాలో అయ్యాడు. ఆ విధంగా శైలజ ఇల్లు కనుక్కున్నాడు. ఆ తర్వాత రోజు ఆ పిల్ల గురించి ఆ పిల్ల ఫ్యామిలీ గురించి పూర్తి వివరాలు రాబట్ట గలిగాడు.


శైలజ నాన్న సర్వారాయుడు రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసి కోట్లు గడించాడు. ఆ కోట్ల ఆస్తికి శైలజ ఏకైక వారసురాలు. ఈ అమ్మడికి చదువు సరిగా ఎక్కకపోవడం వల్ల చదువు మాన్పించి వివాహం చేయాలనుకున్నాడు. ఆ ప్రయత్నంలో భాగంగా... ఇప్పుడు శైలజకి తగిన వరుడ్ని వెతికే ప్రయత్నంలో ఆమె నాన్నగారు వున్నాడు.

సోంబాబు అన్ని పనులు మానేసి శైలజాను ప్రేమించి లైన్లో పెట్టి తద్వారా వివాహం చేసుకోవాలని డిసైడ్ చేసుకున్నాడు. దాంతో శైలజ ఎక్కడికి వెళ్తే అక్కడికి ఆమెని ఫాలో అయి వెళ్ళీ... ఆమెతో మాట్లాడే అవకాశం కోసం తెగ ట్రై చేసేవాడు. కొన్ని రోజులకు ఆ అవకాశం వచ్చింది. శైలజ తన మొబైల్ ఒకచోట మర్చిపోయి వెళ్లిపోతుంటే దాన్ని సోంబాబు తీసుకెళ్ళి ఆమెకి ఇచ్చాడు.




ఆ కృతజ్ఞత తో సోంబాబుకు శైలజ కాఫీ ఆఫర్ చేసింది. ఇద్దరూ కల్సి కాఫీ తాగుతుండగా శైలజతో సోంబాబు-"మీరు నవ్వితే హీరోయిన్ సాయిపల్లవిలా వుంటారు!" అని అబద్ధపు పొగడ్తను ప్రయోగించాడు.

దాంతో శైలజ ఉబ్బితబ్బిబ్బైపోయింది. ఇది గమనించిన సోంబాబు మనసు చంపుకుని శైలజను ఇంకా పొగిడేశాడు.




'నన్ను ఇంతగా అభిమానించే, ఆరాధించే వ్యక్తిని నేను పెళ్లి చేసుకుంటే నన్ను మహా రాణిలా చూసుకుంటాడు గదా!' అని శైలజ మనసులో అనుకుంది.

లేనిపోనివన్నీ కల్పించి అందులో లైట్‌గా అబద్ధాలు మిక్స్ చేసి శక్తివంచన లేకుండా శైలజాని సోంబాబు పొగుడుతూనే వున్నాడు. శైలజ ఎంజాయ్ చేస్తూనే వుంది.


ఇది మొదలు... వారం రోజులు శైలజ, సోంబాబు కలిసి పార్కులు, సినిమా థియేటర్లు, రెస్టారెంట్లు గిరగిరా తిరిగేశారు. ఇప్పుడు లవ్ ప్రపోజ్ చేసినా శైలజ గ్యారంటీగా యాక్సెప్ట్ చేస్తుంది అని కన్‌ఫం చేసుకున్నాక– "ఐ లవ్ శైలూ!" అని స్పూడ్ల్ బ్రీడ్ కుక్కపిల్లని ఆమెకి బహుమతిగా ఇస్తూ చెప్పాడు... శైలజాకు కుక్క లంటే మెయిల్లీ స్పూడ్ల్ జాతి కుక్క అంటే వల్ల మాలిన లవ్... శైలజ పరిచయం అయిన ఈ కొన్నాళ్ళలో ఇది పసిగట్టిన సోంబాబు అదును చూసి గేలం వేశాడు. చేప పడింది.

సోంబాబు చేసిన ప్రపోజల్‌కు శైలజ టకీ మని ఓకే చెప్పేసింది. తదనంతరం ఇద్దరూ ఈట్ లవ్... డ్రింక్ లవ్... స్లీప్ లవ్... డ్రీం లవ్... అన్న చందంగా మెలగసాగేరు.

తొందర్లో తాము పెళ్లి చేసుకుని ఒకపాప, ఒక బాబును కనాలనీ వాళ్లకు అలియా, రణ బీర్ అనే పేర్లు పెట్టాలని భవిష్యత్తు కార్యాచరణ గురించి మాట్లడుకోసాగేరు.

వీళ్ళ ప్రేమ ఇలా దిన దిన ప్రవర్ధమానం చెందుతూ వుండగా ఈ విషయం శైలజ నాన్న సర్వారాయుడి తెల్సిపోయింది. బాణం వేగంతో సోంబాబు వున్న చోటికి సర్వారాయుడు వచ్చి–

"రేయ్ జూక్లే! ఇంకోసారి నా కూతురితో నువ్వు గానీ కనిపిస్తే, నేను సహించను, భరించను... నా చేతిలో నువ్వు చచ్చి నన్ను జైలు పాలు చేయకు!" అని వార్నింగ్ ఇచ్చాడు.




"ప్రేమిచేవాడు భయపడడు, భయపడేవాడు ప్రేమించడు. నీకు ఈ ప్రేమ సూత్రం తెలియక డైలాగులు కొడుతున్నట్టున్నావ్!... నేను నీ కూతుర్ని ప్రేమించడం మానను..నీకు చేత నైతే నన్ను ప్రేమించకుండా నీ కూతుర్ని కట్టడి చేసుకోపో!" అన్నాడు మాస్ హీరోలా స్టైల్ కొడ్తూ.

"డోంట్ అండర్ ఎస్టిమేట్ మి... ఐ విల్ సీ యువర్ ఎండ్!..." చెప్పలేని ఆవేశంతో అన్నాడు సర్వారాయుడు.

"నా ఎండూ చూడలేవూ... నా బెండూ తీయలేవుగానీ... వెళ్ళి నీ కూతుర్ని నాకు ఇచ్చి పెళ్లి చేసే ఏర్పాట్లేవో చేసుకోపో!..." అన్నాడు సోంబాబు వెటకారంగా.

'అలాగా! నేను ఏంటో చూపిస్తా!' అన్నట్టు సర్వారాయుడు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చి... వెళ్ళి పోయాడు.

ఆ రోజు అర్ధరాత్రి సోంబాబు నిద్రపోతుంటే కాలింగ్‌బెల్ సౌండ్ మోగింది.


నిద్ర లేచి వెళ్లి డోర్ తీశాడు.

ఎదురుగా శైలజ పెద్ద సూట్కేసు పట్టుకుని వుంది.

"గోవాలో జరుగుతున్న మా మేనత్త కూతురి పెళ్ళికి మా మమ్మీ డాడీ వెళ్ళారు... మూడు రోజుల తర్వాతే వస్తారు. ఈ లోగా మనం పెళ్లి చేసేసుకోవాలి!" అని అంది శైలజ ఇంట్లోకి వచ్చి కూర్చున్న తర్వాత.

"ఓకే...డన్!" అన్నాడు సోంబాబు.

తన జాతకం ప్రకారం తన పెళ్లి జరగబోతు న్నందుకు... హ్యాపీ ఫీల్ అయ్యాడు సోంబాబు.




మరుసటి రోజు ప్రొద్దున్నే సోంబాబు లేచి పెళ్లి ఏర్పాట్లుకు కావాల్సిన సామగ్రితో పాటు గుడికి అడ్వాన్స్ ఇవ్వడం,పురోహితుడిని మాట్లాడడం, ఇలా అన్ని పనులు చేసుకున్నాడు.

ఇంటికి వచ్చిన సోంబాబు... అక్కడ వున్న శైలజాతో– "శైలూ! అన్నీ ఏర్పాట్లు జరిగిపోయాయి. రేపు సాయంత్రం ఆరు గంటలకు గంగమ్మ గుడిలో మన పెళ్లి. అంటే... రేపు ఈ పాటికి మన పెళ్లి అయిపోయి వుంటుంది." అని సోంబాబు అనగానే శైలజ సిగ్గు పడింది.

✦✦✦

మరుసటిరోజు తెల్లవారింది.

ఏదో పనుందని పొద్దున్నే సోంబాబు బయటికి వెళ్లి పోయాడు. మంగళవారం కాబట్టి దేవుడికి దణ్ణం పెట్టుకుని వద్దామని అక్కడికి దగ్గర్లో వున్న గుడికి వెళ్ళింది శైలజ.

ఆ గుడిలో ఓ స్వామీజీ వున్నాడు. శైలజాను చూసిన ఆయన– "బిడ్డా!... నిన్ను చూస్తోంటే నువ్వు అడక్కపోయినా నీ జాతకం చెప్పాలని వుంది... నిన్ను ఇష్టపడే వ్యక్తుల్లో ఎవరైనా... మొదటి అక్షరం 'బి'... చివరి అక్షరం 'ల' తో ముగిసే వ్యక్తి వుంటే... అతనిని పెళ్లి చేసుకో! నీ జీవితం పరమ బేషుగ్గా వుంటుంది!" అని సెలవిచ్చి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

శైలజాకు జాతకలంటే మంచి నమ్మకం వుంది. స్వామీజీ చెప్పిన వ్యక్తి ఎవరై ఉంటారా అని ఆలోచిస్తూ ఇంటికి వెళ్ళింది.

కాసేపు అయ్యాక సోంబాబు వచ్చి ఇంట్లో వున్న శైలజాతో–"శైలూ... నేను స్నానం చేసి వస్తాను. వెంటనే గంగమ్మ గుడికి బయలుదేరి వెళ్ళిపోదాం!"అని అన్నాడు.

"నిన్ను పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టం లేదు సోంబాబు!" అని అంది శైలజ.

పక్కనే అణుబాంబు పడ్డట్టు షాక్ అయి–

"ఏ...ఎందుకు?" అని సోంబాబు కంగారుగా అడిగాడు.

గుడిలో స్వామీజీ ఉదంతం చెప్పింది.

"అలాంటి పేరుగల వ్యక్తి ఎవరున్నారు?... పైగా నిన్ను ఇష్టపడేవాడు?..." అన్నాడు సోంబాబు.

"వున్నాడు!...మా ఇంటి పక్క సందులో బిట్టూలాల్ అనే ఆయన... పానీపూరీ బండి పెట్టుకుని వున్నాడు. ఆయన నాకంటే పాతికేళ్ళు పెద్దవాడైనా.. ఆయనకు నేనంటే చాలా ఇష్టం... నేను ఆయన్నే పెళ్లి చేసుకుందామనుకుంటున్నా. ఇందాక అతనికి ఫోన్ చేశా!... గంటలో నన్ను రైల్వేస్టేషన్‌కు లగేజీతో రమ్మన్నాడు... వాళ్ళ సొంతూరు బీహార్‌లో బిల్వాడ అంట.అక్కడికి వెళ్ళిపోదాం అన్నాడు." అని బట్టలు సర్దుకుని బయలుదేరి పోతుంటే...

సోంబాబు పలు రకాలుగా కన్విన్స్ చేసి శైలజాను ఆపాలని చూశాడు.

కానీ, సోంబాబు మాటలు శైలజ వినే స్థితిలో లేదు... ఇంతలో ఆటో రావడంతో... ఎక్కి తుర్రుమంది.

వస్తున్న ఏడుపుని ఆపుకుంటూ... ఇంట్లో కూలబడ్డాడు సోంబాబు.

✦✦✦

నాలుగు రోజుల తర్వాత సోంబాబు ఫోన్ మోగింది.ఎవరిదో అన్నోన్ నెంబర్.

బహుశా శైలజ నంబరేమోనని ఆశగా లిఫ్ట్ చేశాడు.

"ఏయ్! టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మగధీరని మాట్లాడుతున్నాను... మాట్లడేది సొంబాబా?" అని కరుకుగా అడిగాడు.

"ఔను సర్." అన్నాడు సోంబాబు భయపడుతూ.

"నువ్వు సర్వారాయుడి కూతురు శైలజ అనే అమ్మాయిని కిడ్నాప్ చేశావని, ఆ అమ్మాయి నాన్న నీ మీద కంప్లైంట్ ఇచ్చాడు."

"లేదు సర్! ఆ అమ్మాయి బిట్టూలాల్ అనే వాడితో బీహార్‌కు లేచిపోయింది!" అన్నాడు సోంబాబు.

" రేయ్!...ఖతర్నాక్ కథలు చెప్పకు! అర గంటలో ఆ అమ్మాయిని తీసుకుని పోలీస్ స్టేషన్ రా! రాకపోతే నిన్ను అరెస్ట్ చేసి జైలుకు పంపను... ఎన్ కౌంటర్ చేసి పైకి పంపుతా!" అని కాల్ కట్ చేశాడు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మగధీర.

తనకి జాతకం చెప్పిన జ్యోతిషుడి మీద సోంబాబుకి ఎక్కడలేని కోపం వచ్చి... ఆవేశంగా ఆయన దగ్గరకు వెళ్ళాడు. జరిగింది చెప్పి– "మీరు చెప్పినట్టే చేశాను...కానీ ఇలా బుక్కై పోయానేంటీ గురూజీ?"అని అడిగాడు.

"అదంతా నాకు తెల్దు.. నువ్వు ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుని వుంటే నీ లైఫ్ అంగరంగ వైభవంగా వుండేది... నువ్వు గానీ ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోకపోతే నీ బతుకు బంగ్లాదేశ్ దేశంలా తయారౌతుంది..." అని ఇంకా ఏదో చెప్పబోతుండగా...

ఇంతలో ఫోన్‌కాల్ రావడంతో మాట్లాడుతూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు... ఆ జ్యోతిష్కుడు.

ఇంతలో సర్కిల్ ఇన్స్పెక్టర్ మగధీర నుండి ఫోన్ కాల్ రావడంతో సోంబాబుకు వచ్చిన హై బీపీ వల్ల స్పృహ తప్పి... అక్కడే కూలబడ్డాడు.


# ఇండియన్ ఇంక్

## భారతీయ కార్టూనిస్టులు

ప్రతి నెలా ఇతర భాషలకు చెందిన ఒక భారతీయ కార్టూనిస్టుల పరిచయం

నిర్వహణ: నాగిశెట్టి

### శ్రీ బీవీ పాండురంగారావు




**భి**లాయి లోని స్టీల్ ఫ్యాక్టరీలో పనిచేసే ఒక ఎంప్లాయీ దేశం గర్వించదగ్గ గొప్ప కార్టూనిస్టుగా ఎలా ఎదిగారో తెలిస్తే అది దేశం లోని కార్టూనిస్టులందరికీ గొప్ప పాఠం అవుతుంది... అందరికీ మార్గదర్శకమౌతుంది.

ఆ కార్టూనిస్ట్ ఎవరో కాదు... శ్రీ బీవీ పాండురంగారావు గారు.

కర్ణాటక రాష్ట్రం లోని సిద్లగట్టకి చెందిన వీరి పుట్టిన తేదీ 20.09.1944. వీరి తండ్రి డాక్టర్ బీవీ వెంకట రావు. వీరి తల్లి శ్రీమతి ఇందిరాబాయి.

ఇంటి దగ్గరనుంచి 1800 కిలోమీటర్ల దూరంలో ఉన్న భిలాయి ఉక్కు కర్మాగారంలో 1965లో పనికి చేరారు. దుమ్ము, వేడి, గ్యాస్ వంటి వాటి మధ్యలో చాలా క్లిష్టమయిన పరిస్థితుల్లో పని చేసినప్పటికీ అది తనకు ఎంతో తృప్తినిచ్చింది అంటారాయన.

మొదటగా ఆ ప్లాంట్‌లోని పరిస్థితుల మీద కార్టూన్లు వేస్తూ తోటి ఉద్యోగులను నవ్విస్తూ తరువాత ప్లాంట్‌కి సంబంధించిన పత్రికలో కార్టూన్లు వేయడం ప్రారంభించారు.

తరువాత దైనిక్ భాస్కర్, దేశ్‌బంధు, నవభారత్ లాంటి పత్రికలతో పాటు వివిధ హింది పత్రికలకు తన కార్టూన్లు పంపించేవారు.






ఆయనకున్న ప్రతిభా పాటవాలు చూసిన మేనేజ్మెంట్ ఆయనని పబ్లిక్ రిలేషన్స్ విభాగానికి తీసుకోవడం జరిగింది. అక్కడినుంచి ఆయన కలానికి తిరుగు లేకుండా పోయింది.

దేశంలోని అన్నీ పత్రికలకు పాఠకులకూ దగ్గర కావడం కోసం ఆయన హిందీ భాష నేర్చుకోవడం మొదలు పెట్టారు.

వీరి మొట్టమొదటి సోలో కార్టూన్ల ప్రదర్శన 1980 లో జరిగింది. జాతీయ రికార్డ్ సంపాదించిన ఆయన 50వ కార్టూన్ల ప్రదర్శన 2017లో జరిగింది.

వీరు యూఎస్ఏకి సంబంధించిన ఒక సంస్థలో కార్టూనింగ్‌లో డిప్లొమా సాధించారు.

మొట్టమొదటిసారిగా 1996లో కార్టూన్ వాచ్ వారి మొదటి ఇష్యూ కవర్ పేజ్‌గా ప్రచురించబడింది.

1987లో వీరి అంతర్జాతీయ కార్టూన్ల ప్రస్థానం స్విట్జర్లాండ్‌లోని ఒక కార్టూన్ల ప్రదర్శనద్వారాస్ ప్రారంభమయ్యింది.

1992 లో మొట్టమొదటిసారిగా ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ ఆర్.కె లక్ష్మణ్‌గారిని కలిసి ఆయనను భిలాయ్‌కి ఆహ్వానించగా, ఆయన వీరి స్థానం సంపాదించుకుంది.

ఇంతకంటే ఒక కార్టూనిస్టుకి  ఇంకేమీ కావాలి? ఇంతేనా?...

వీరు 14 లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, 15 ఇండియా బుక్ రికార్డ్స్, 13 వరల్డ్ రికార్డ్స్, సాధించిన ఘనత ఈయనది.

ఇంత ఘనత సాధించినవారు దేశంలో మరొకరు లేరు అని ఘంటా పథంగా చెప్పవచ్చు.


ఇది మన కార్టూనిస్టులందరికీ కూడా గర్వకారణం.

ఏం.ఏ.చదివిన వీరి శ్రీమతి వీణ వాయించడంలో ప్రసిద్ధురాలు కాగా కుమార్తె మంచి పేయింటర్‌గా పేరు సంపాదించారు. వీరి కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.

వీరికి వచ్చిన అవార్డులు కనక చూసినట్లయితే... ఇది ఒక మనిషికి సాధ్యమా అనిపిస్తుంది!

వీరు దాదాపు అన్నీ ప్రపంచ కార్టూన్ల పోటీలలో అన్నీ జాతీయ స్థాయి కార్టూన్ల పోటీలలో బహుమతులు సాధించారు.

ఇటీవలే వీరికి వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కమీషన్ వారు ఆనరరీ డాక్టరేట్ ఇచ్చి సత్కరించడం  జరిగింది.




అభ్యర్థనని మన్నించి సతీ సమేతంగా భిలాయ్ వచ్చి వీరి కారికేచర్‌ని గీసి వీరు ఏర్పాటుచేసిన కార్టూన్ల ఎక్సిబిషన్‌ని ప్రారంబించడం తనకు మరపురాని అనుభూతినిచ్చింది అంటారు.

దూరదర్శన్ ఢిల్లీలో వీరి ఇంటర్వ్యూ మొదటిసారిగా 1984లో రావడం జరిగింది.

అనేక అంతర్జాతీయ కార్టూన్ల పోటీలలో పాల్గొని అనేక బహు మతులు పొందిన ఆయన మొదటిసారి 1996 లో కార్టూన్ల కాటలాగ్‌ని అందుకోవడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది అంటారు.

క్రికెట్ మరియు షటిల్ బ్యాడ్మింటన్‌లో మంచి మక్కువ ఉన్న ఈయన క్రికెట్ రంగంలో ప్రముఖులందరి దగ్గరనుంచీ వారి వారి ఆటోగ్రాఫ్‌లు పొందడం తన అదృష్టమంటారు.

2001లో రిటైర్ అయ్యిన వీరు బెంగుళూరులో స్థిరపడ్డారు.

2010లో వీరు అత్యధిక అంతర్జాతీయ కార్టూన్లా పోటీలలో బహు మతులు పొందినందుకు గాను వీరి పేరు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో

**కొన్ని బహుమతుల వివరాలు:**

చైనా బ్రాంజ్ అవార్డ్, చైనా జియాజింగ్ అవార్డ్, ఇజ్రాయిల్ కార్టూన్ కాంటెస్ట్, ఫెరిజాజ్ కార్టూన్ కాంటెస్ట్ యూనిమెడ్ హెల్త్ అవార్డ్, లాడ్లీ క్రియేటివ్ ఎక్సెలెన్స్ అవార్డ్, EMCON 87 పోస్టర్ అవార్డ్, AP స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటి కాంటెస్ట్‌లో ఫస్ట్ ప్రైజ్, INSSAN కమెండేషన్ అవార్డ్, హిందూస్తాన్ టైమ్స్ కాంటెస్ట్ 1987 అవార్డ్, ఇంకా ఎన్నెన్నో...

ఇంత వయసులోనూ ఇంకా ఆయన ఉత్సాహంగా అన్నీ పోటీలలో పాల్గొంటూ ఉంటారు.

సోషల్ మీడియాలో కూడా చాలా చురుకుగా ఉంటారు.

వీరినుంచి మన కార్టూనిస్టులు నేర్చుకోవలసింది ఎంతైనా ఉంది.

కార్టూన్లను ఇష్టపడే వారందరూ ఆయన ఆయురారోగ్యలతో పది కాలాల పాటు ఇలాగే తన కార్టూన్లతో నవ్వులు పూయిస్తూ ఉండాలని కోరుకుందాము.





# సినిమా తీద్దామా?

## సీన్ సీన్‌కో రైటర్!

గొలుసు సీరియల్

**ఈ నెల రచయితలు: ✦ తాడేపల్లి అనంతలక్ష్మి ✦ రావూరి నరేశ్**

### ఇరవైయవ సీన్– **తాడేపల్లి అనంతలక్ష్మి**

(గత సంచిక తరువాయి)

"సార్ సార్ అన్కుంట, పాటలల్ల రాగం దీసింలెక్క. గంత సాగదీసుడేంది? ఊకె పానందినక, నీ పరేషానీ జెప్పరాదె! నాతోని అయ్యేడిదైతె, మదద్‌జేస్తా!" గుడ్లురుముతూ అన్నాడు... ఒక సెటిల్‌మెంట్‌కి వెళ్ళే తొందరలో ఉన్న గణేష్.

"ఆ షూటింగ్ ట్రాక్ అద్దె ఖర్చు మీరు పెట్టుకోండి. లేదంటారా... సురేష్‌ను నే చెప్పినట్టు ఆక్ట్ చెయ్యమనండి!" అంటూ తెలివిగా, తేల్చేశాడు శేషాచలం.

✦✦✦

గణేష్ అద్దెకు తెప్పించిన షూటింగ్ ట్రాక్‌తో మళ్ళా సినిమా మొదలైంది.

ట్రాక్ మీద కెమెరాతో ఏకనాథం... వెనుక బంతిపూలు విసురుతూ సురేష్, ముందు... ప్రతిభ వయ్యారపు నడకతో పాట మొదటి చరణం షూటింగ్ పూర్తయింది.

"ఇగో సారూ! తర్వాత పాటల నేను దాన్సు జేస్త!" అంటూ, కల్లు తాగిన కోతిలా గంతులెయ్యసాగాడు సురేష్.

కెమెరా యాంగిల్ సరిగా కుదరట్లేదనీ ఏకనాథం, కాలిన బాండీలోని ఆవగింజలా చిటపటలాడసాగాడు.

"హోరి నాయనో! ఈ సురేష్ గాడి దుంప పిలకె! ఇప్పుడెలా రా దేవుడో!" అని శేషాచలం కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతుండగా...

ప్రతిభ– "సార్!(అందరి ముందు తాతగారు అనడం బాగోదని)ఒక్కసారి ఇటు చూడండి!"అంటూ, పాటకు తగ్గ వెస్ట్రన్ డ్యాన్స్ స్టెప్పులు వేసి చూపించింది. కళ్ళకింపుగా ఉన్న ఆ స్టెప్పులు, సురేష్ చేస్తుంటే, కుప్పిగంతుల్లా ఉన్నాయి!

**ఫ్లాష్‌బ్యాక్**

శేషాచలం పదవీ విరమణ చేశాక, వచ్చిన డబ్బులలో మిగిలిన ఓ లక్ష రూపాయతో తన చుట్టూ ఉన్న వాళ్ళని వాడుకుని ఒక చిన్న ఓటీటీ సినిమా తియ్యాలన్న ఉద్దేశంతో పరిచయస్థులను వాడుకునే క్రమంలో...

ఇలా అవస్థలు పడుతూ, పాట షూటింగ్ పూర్తికాబోతుండగా, దూరంనుంచి బంటి, బబ్లూ చప్పట్లుకొడుతూ వచ్చి, ఏకనాథాన్ని గమనించకుండా గుద్దేశారు! ముందుకు తూలి, చేతిలో కెమెరా వదిలేశాడు ఏకనాథం!!

రవీంద్ర జడేజాలా ముందుకు డైవ్ చేసి, కెమెరాను పొదివి పట్టుకున్నాడు అంతకు ముందే వచ్చిన మహేష్, వెంటనే ఏకనాథం అలెర్ట్ అవడంతో, శేషాచలం గుండె గుభేల్మన కుండా అప్పటికి స్థిమిత పడింది.

✦✦✦

సినిమా గురించి... ఫీలర్ ఎలా రిలీజ్ చెయ్యాలో ఆలోచిస్తూ ఇంటికి బయల్దేరిన శేషాచలం, వెనుకే వస్తున్న ఉపద్రవాలను గమనించలేదు.

కాంతం, రాజ్యం పిన్ని ఇద్దరూ బజారు కెళ్ళడంతో, తన దగ్గరున్న తాళంతో తలుపు తెరచి, సోఫాలో కూర్చుని, ఆప్యాయంగా తన బ్రిటానికా వంక చూస్తూ... తనకు ఆస్కార్

వచ్చినట్లు ఊహల్లో తేలిపోసాగాడు.

ఇంతలో శేషాచలాన్ని ఎలాగైనా బతిమాలి, ప్రతిభతో ఒక పాట చేసేట్లు అవకాశం ఇప్పించుకోవాలని కాలనీ రెబల్, సాయంగా భైరావి లోపలికి రావడం... వస్తూనే, తారాస్థాయిలో ఆందోళన కలిగించేట్లు, భైరావి హిందోళ స్వరపల్లవి అందుకుని...

"నిదనిస కిణఝుం దనిసానిద
తఝుంతరిత... తకుందరి... ఝుణత... నిదమ తధింగిణత
దానిసగ సమగసా..." అని పాడుతుండగా... రమేష్ చిత్ర విచిత్ర నాట్య భంగిమలతో రెచ్చిపోసాగాడు.


ఈ స్వర నాట్యవిలాస ఝురికి ఇహలోకంలోకి వచ్చిన శేషాచలం... చివ్వున లేచి, తట్టుకోలేక, "నిస గస సమోసా..." అని కలవరిస్తూ కళ్ళుతిరిగి స్పృహకోల్పోయాడు!

✦✦✦

హాస్పిటల్లో శేషాచలాన్ని పరీక్షించిన డాక్టర్లు విస్తుబోయారు.

"అసలీయన బి.పీ.ఇలా డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఆడేస్తోందేవిటి? నిన్నేగా అన్నీ టెస్టు నార్మల్ అని వచ్చాయి... పైగా నిస గస సమోసా అంటూ ఆ కలవరింతలేంటి?" అని అక్కడ ఉన్న వాళ్ళను అడిగారు.

సుయోధనరావు ఇదే ఛాన్స్ అని రకరకాల హావభావాలతో జరిగింది చెప్తుండగా, కాంతం దగ్గర విదేశాల్లో ఉన్న వాళ్ళబ్బాయి సంతోష్ నంబరు తీసుకుని, ఫోన్ చేసి విషయం తెలిపాడు ఏకనాథం.



అందరూ రమేష్, భైరావిల వంక పులిలా తినేసేటట్టు చూస్తుండటంతో, కాలనీ రెబల్ కాస్తా మౌనమునిలా, భైరావి మౌన కోకిలలా, అపరాధ భావనతో తలొంచేసారు.

✦✦✦

షాక్‌కి గురై... బి.పీ. ఫ్లక్చువేషన్స్‌తో హాస్పిటల్లో అడ్మిట్ అయిన తండ్రి సంగతి వినగానే రావాల్సింది పోయి, సంతోష్, శరణ్య (కోడలు) తీరిగ్గా రెండురోజుల తరవాత పలకరించ డానికి వీడియోకాల్ చేసి...

పరామర్శ సంగతి అటుంచి, "కృష్ణా రామా అనుకోక ఈ సినిమా, గినిమా అవస్తలు, హాస్పిటల్లో పడటాలు ఎందుకంటూ..." దెప్పిపొడవ సాగారు.


శేషాచలం మిన్నకుండగా...

కాంతం మొఖం మ్లానమై, కళ్ళు కరి మబ్బులా వర్షించసాగాయి.

అంతా గమనిస్తున్న రాజ్యం పిన్ని–

"ఆఁ!... ఆఁ! ఏందిరా గుడ్డు వచ్చి పిల్లను ఎక్కిరించినట్లు, మీ దెప్పిపొడుపు లేవిటి?... మీరిద్దరూ వచ్చి, తెగ ఆదరణ వడ్డిస్తారని... ఎవరూ విస్తరేసుకు కూర్చోలేదిక్కడ! నా శేష్ సినిమా హిట్టు చేసి... పెద్ద కప్పు (ఆస్కార్) సాధిస్తాడు చూస్తుండండి!"అన్న పదునైన మాటలకు...

శరణ్య– "ఓయబ్బో!"అనుకుంటూ గుర్రుగా చూస్తే, సంతోష్‌కి చుర్రుమని, కర్రుగా (కోపంగా) చూసాడు.




## ఇరవైఒకటవ సీన్–
## రావూరి నరేశ్

రాజ్యం పిన్ని ఆవేశంతో అక్కడినుండి డాక్టర్ గది వైపు వేగంగా నడుచుకుంటూ వెళ్ళింది.

అప్పుడే పేషెంట్స్‌ని చూసి, తన గదిలోకి వచ్చి ఏదో తింటూ ఉన్న డాక్టర్ గారు... అంత ఆవేశంతో తన గదిలోకి వచ్చిన పిన్ని అవతారం చూసి చాలా ఆశ్చర్యపోయారు.

నోట్లో బుగ్గల నిండా కుక్కుకున్న తిండిని ఓ పట్టు పడుతూనే "ఓమ్మా! ఓమైంది?... కొంపదీసి మీవాడు..." అంటూ తన ఆశ్చర్యాన్నంతా ముఖంలో చూపిస్తూ గుడ్లగూబలా కళ్ళు పెద్దవీ చేశాడు.


పిన్ని ఇంకా ఆవేశంతో–"నువ్వేం డాక్టరు వయ్యా బాబు!... ఎప్పుడూ అపశకునం మాటలు మాట్లాడుతున్నావు, బతికించాల్సింది పోయి, పోయాడా అంటున్నావా?"అనగానే

గబగబా ఏదో రకంగా నోట్లో ఉన్న దాన్ని నమిలి మింగేసి– "అంటే, అలా కాదమ్మా!... సుమారు చివరంచుదాకా వెళ్ళొచ్చేసాడు కదా! ఒకడుగు వేసేసాడేమో అని డౌట్ వచ్చింది, అంతే!" అన్నాడు డాక్టర్.

"ఆహా! వాడేసేస్తాను అంటే నువ్వు చూస్తుంటావేమో! పెద్దదాన్ని నేనున్నాను కదా! నేను ఊరుకుంటానా?... మావోడు ఒక్క అడుగు కాదు, ఎన్నడుగులేసినా మళ్ళీ వాడిని వెనక్కి తీసుకొచ్చి, వాడు అనుకున్నది సాధించేదాకా వాడెనకే ఉంటాను నేను...!" అంటూ ఆవేశంతో రెండు దగ్గులు కూడా దగ్గింది.

"ఓహో! అంటే ఈ వృద్ధమగాడు సాధించబోయే విజయానికి వెనకాల ఉండే ఆ ఒక్క ధీరవనిత మీరేనన్న మాట!" అని వెటకారంగా అన్నాడు డాక్టర్.

"డాక్టర్ గారు!... మరీ అంత వెటకారం వద్దండీ! మీరు డాక్టర్ అవ్వడానికి ఒక ఆడది ఎలా వెనకాల ఉందో...మావాడు డైరెక్టర్ అవ్వడానికి నేను అలాగే వాడి వెనకాల ఉంటాను. మీలాంటి వాళ్ళు ఎంతమంది వాడి టాలెంట్‌ని తొక్కేయాలని చూసినా నేను మాత్రం వాడిని పైకి..పైపైకి లేపుతూనే ఉంటాను." అంటూ గంభీరంగా ఊగిపోతూ చెప్పింది రాజ్యం.






"వామ్మో! ఓయమ్మో! నా భయం అదే నమ్మ! మీరు లేపడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఆయన ఇప్పుడే పైకి.. పైపైకి.. పోతాడేమోనని. పైగా మీ వాడిని మేము తొక్కేయడమేంటమ్మా? ఆయన ఒంట్లో ఉన్న షుగరు, బీపీ జబ్బులే ఆయన్ని కదలనిచ్చేలా లేవు... ఇప్పుడు కూడా ఇంకా ఆయన సినిమాలు షూటింగ్లు అంటూ తిరిగితే ఇక ముందుకు సాగదు ఆయన జీవిత సినిమా... ఒక్కసారిగా పైకే..." అన్న డాక్టర్ మాటలు విన్న రాజ్యం పిన్ని–

"ఇదిగో డాక్టరో! నీకు మళ్ళీ చెప్తున్నా విను, ఇంకొద్ది రోజుల్లోనే మా వాడిని మంచం మీద నుండి లేపుతాను, షూటింగ్ మొదలు పెట్టిస్తాను, పూర్తి చేయిస్తాను, థియేటర్లో రిలీజ్ చేయించి... వాడికి ఆస్కార్ అవార్డు వచ్చేలా చేస్తాను!" అంటూ తొడకొట్టి సవాలు విసిరింది రాజ్యం పిన్ని.

"ఆహా! అంత పని చేస్తారా!... ముందు మీ వాడిని ఇక్కడి నుంచి డిశ్చార్జ్ అవ్వనివ్వండి అప్పుడు చూద్దాం!" అన్నాడు డాక్టరు.

"చూడు! మావాడి ఎదుగుదలను చూడు. డాక్టర్ కంటే యాక్టరే గొప్పవాడని, ఆ యాక్టర్ని సూపర్ యాక్టర్స్ని చేసే డైరెక్టర్ ఇంకా ఇంకా గొప్పవాడని నువ్వే ఒప్పుకుంటావ్!" అంటూ కోపంతో ఊగిపోతూ డాక్టర్ గదిలోంచి బయటకు వచ్చింది రాజ్యం పిన్ని.

ఎంతో ఆవేశంతో డాక్టర్ గారి దగ్గరికని వెళ్ళిన పిన్ని ఎంతసేపటికి రాకపోయేసరికి కాంతం తప్ప అక్కడ ఉన్న వారందరూ అసలు ఏం జరుగుతుందో చూద్దామని... అప్పటికే డాక్టర్గారి గది తలుపు దగ్గర గుంటకాడ నక్కల్లాగా ఎదురుచూస్తున్నారు.

గ్లాస్ డోర్ లోనుంచి లోపల జరిగిందంతా చూడగలిగారు తప్ప... మాటలు వినలేక పోయారు. అందుకేనేమో వారి మధ్య జరిగిన డ్రామాని ఒక్కొక్కళ్ళు ఒక్కోరకంగా ఊహించేసుకున్నారు. రాజ్యం పిన్ని బయటకు వచ్చేసరికి ఒకేసారి అందరు...

"అసలు ఏం జరి గింది పిన్నీ?" అని అడగడం మొదలుపెట్టారు.

కంగారులో చొక్కా తొడుక్కోవడం కూడా మర్చిపోతున్నాడేమో... కానీ కెమెరా తీసుకు వెళ్లడం మాత్రం మర్చిపోవడం లేని ఏకనాథం అక్కడ జరిగిందంతా వీడియో తీసేశాడు. పైగా రాజ్యం పిన్ని గారితో– "మీరు చాలా అద్భుతంగా నటించారు... మొత్తం సీను సింగల్ టేకులో అయిపోయింది. ఇక దీనికి మనం డబ్బింగ్ చెప్పుకోవడం ఒకటే తరువాయి. మన డాక్టర్ గారు కూడా అద్భుతంగా నటించారు!" అని కితాబు ఇచ్చాడు.

అప్పటికే డాక్టర్ గారితో వాదించి చిరాకు మీద ఉన్న పిన్ని ఒక్కసారిగా అందరి మీద అరిచింది.

"హే! ఆపండే! మీరు మీ వెధవ సినిమా గోల!... అసలైనోడు మంచం మీద పడి ఉంటే కొసరులైన మీరేంటి? ముందు మనం డైరెక్టర్ శేష్ని రెడీ చేయాలి... పదండి! మనమంతా మనకు తోచిన రీతిలో వాడికి ఉత్సాహాన్ని కలిగించి, వాడిలో చైతన్యాన్ని కలిగించి, వాడిని ఆరోగ్యవంతుణ్ణి చేయాలి. అప్పుడు సినిమా పూర్తి చేయాలి... ఇదే నేను డాక్టర్ తో చేసిన శపథం పదండి!" అంటూ అందరినీ శేషాచలం ఉన్న గదిలోకి తీసుకువెళ్లింది.

శేషాచలానికి ఏదైనా అయితే ఎన్నో సినిమా ఆశలు పెట్టుకున్నా వీరి ఆశలన్నీ అడియాసలైపోతాయని కంగారుపడుతూ ప్రతి ఒక్కరూ తలో వారి డైరెక్టర్ కం ప్రొడ్యూసర్ని నార్మల్గా చేయటానికి సకల విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. **(సశేషం)**



Reverse Gear

# వెనక్కి వెళ్ళే కథలు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

## ఇల్లు అమ్మను

"ఏవిట్రా!... నేను విన్నది అంతా నిజమేనా?!" అడిగాడు శేఖరం పళ్ళు పట పటా కొరికేస్తూ...

"ముందు విషయం చెప్పు.అది నిజమో కాదో నేను చెప్తాను!" అన్నాడు సుబ్బారావ్, కాస్త తేలిగ్గా.

"ఏవిటా!?నేను చచ్చి చెడీ, కింద మీదా పడి, అటు ఇటు వెళ్లి, నాలుగు చోట్ల అడిగి, నాలుగు మూలలా తిరిగి, మీ పాత ఇల్లు కొనుక్కునే... మంచి బేరం నీ దగ్గరకి పంపిస్తే, పెద్ద పిస్తాలాగా, నేను నిర్ణయం వెనక్కి తీసుకుంటున్నాను. నేను ప్రస్తుతం ఇల్లు అమ్మను... అని వాళ్ళని వెనక్కి పంపేసావట. అమ్మబోతే అడివి, కొనబోతే కొరివిలా ఉన్న ఈ కాలంలో, ఇంత మంచి బేరం కాలదన్నుకున్నావ్. అయినా...ఇలా నిర్ణయం వెనక్కి తీసుకునే ఉద్దేశం ఉన్న వాడివి... పట్నంలో ఉంటున్న మీ అబ్బాయితో అలా నాకు ఫోన్లు మీద ఫోన్లు చేయించి, నన్ను ఎందుకు బేరం చూడమన్నావ్?".... ఊపిరి పీల్చుకునీ...



"సరే మీ అబ్బాయితో అన్ని ఫోన్లు చేయించావ్ కదా అని, నేను తెగ ఆవేశపడిపోయినందుకు, నాకు చివరకు ఆయాసం మిగిల్చావ్! నా శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరయిపోయింది. ఇప్పుడు నేను అలిగాను... బుంగమూతి కూడా పెట్టుకున్నాను!" చెప్పాడు శేఖరం అటు వైపుకి తిరిగిపోతూ.


"అలా అనకురా!... మామూలుగానే నీ మొహం చూడ్డం కష్టం,అలాంటిది బుంగ మూతి పెట్టుకుంటే... అసలు చూడలేం... జంబూద్వీపం జిరాఫీలా ఉంటావ్!" అని వికారంగా మొహం పెట్టుకుని, శేఖరాన్ని గడ్డం పట్టుకుని ఇటు తిప్పి– "మా అబ్బాయి ఇలా ఇల్లు అమ్మేస్తున్నట్టుగా నాకు కూడా వారం క్రితమే చెప్పాడు. నేను అమ్మాలా వద్దా అనే డైలమాలో పడ్డాను. నేను వాడి మొహం మీద, ఏ విషయం అంత వెంటనే చెప్పలేక, అటు కక్కలేక ఇటు మింగలేక, సరే ఆలోచిద్దాంలే అన్నానంతే... ఆ మాటకే ఆ దరిద్రుడు తెగ ఉత్సాహ పడిపోయి, ఇలా ఇంత తొందరగా నా ఇంటికి ఎసరు పెడతాడనుకోలేదు. ఇల్లు అమ్ముడు కాబోతోంది అని తెలియగానే, ఒక్క సారిగా నేను ఉన్నట్టుండి ఆ రోజే... అప్పుడే... ఆ గంట, ఆ నిమిషానికే ఒంటరి అయిపోయినట్టుగా ఫీలయ్యాను. పైగా ఊహించుకుంటేనే ఆ ఒంటరి జీవితం చాలా భయంకరంగా అనిపించిందిరోయ్! అందుకనే, ఒంటరి అయిపోవడం నాకు ఇష్టం లేక, వెనకడుగు వేసి... ఇలా ఈ నిర్ణయాన్ని ముందుకు వెళ్లకుండా ఆపేసి, ఇల్లమ్మాలనే నిర్ణయాన్ని మళ్లీ వెనక్కి తీసేసుకున్నాను!" చెప్పాడు సుబ్బారావు.

ఆ మాటలకి బుర్ర గోక్కుని... కొంచెం అర్థమై... కొంచెం అర్థం కానట్టుగా... శేఖరం పిచ్చి చూపులు చూస్తూ– "చదివేస్తే ఉన్నమతి పోయినట్టు... ఈ మధ్య నీకేమైనా పిచ్చి గానీ మొదలైందా? నీలాంటి వాడే వెనకటికి, పిచ్చి కుదిరింది తలకు రోకలి చుట్టమన్నాడట, అలా ఉంది నీ వరస! నువ్ ఇప్పుడు ఒంటరవడం ఏంటి నా బొంద!... మీ ఆవిడ పోయి దగ్గర దగ్గర రెండు సంవత్సరాలు కావస్తోంది కదా! అలాంటిది ఇప్పుడు నువ్వు కొత్తగా ఒంటరెలా అవుతావు?!...అదీ ఇల్లు అమ్మితే!"అడిగాడు

దేబ్యపు మొహంతో, విచిత్రంగా చూస్తూ.

"మా ఆవిడ చనిపోయినా, ఈ ఇంట్లో బతికే ఉంది. నేను ఏ మూలకి వెళ్ళినా... తను ఆ మూల నాకు కన్పిస్తూనే ఉంటుంది. ఇరవై నాలుగ్గంటలూ నాకు తోడుగా ఉంటోంది!..." చెప్పాడు... ఓ బెడ్‌రూం వైపు వత్రుసుడిగా (దీర్ఘంగా రొటీన్ అని) చూస్తూ ...

"ఆఁ!...అఁ...అంటే మీ ఆవిడ దెయ్యం అయి ఈ ఇంట్లోనే తిరుగు తోందా?... అర్థమైంది మొత్తం అంతా నాకిపుడు!... హెచ్.డీ. క్లారిటీలో అర్థ మైంది... ఇన్నాళ్ళూ దెయ్యాల సినిమా లన్నీ కల్పితం అనుకునేవాడ్ని... నీ మాటలు వింటుంటే, అవన్నీ నిజమే అన్పి స్తోంది." అని మెడలో ఆంజనేయస్వామి బిళ్ళని చేత్తో పట్టుకుని, వెనక్కెనక్కి వెళ్ళి గోడకి జార బడి... గాబరా పడిపోతూ... గజ గజా వణికి పోతున్నాడు.




"ఇంట్లోనే ఉంటోందీ అంటే, నువ్వను కున్నట్టు కాదెహే...మా ఆవిడ పోయినా, తన జ్ఞాపకాలు ఎప్పుడూ... నా వెంట పడుతూనే ఉంటాయ్. ఆ బెడ్ రూమ్‌లోకి వెళితే, నన్ను తిట్టిన బూతులు గుర్తొస్తాయ్... హాల్లో ఉంటే, తను నా నెత్తిన మొట్టిన మొట్టికాయలు గుర్తొ స్తాయ్... వంట గదిలోకి వెళితే, నాకు అట్ల కాడతో ఆమె పెట్టిన లేత వాతలు గుర్తొస్తాయ్. అలాగే పెరటి వైపు చూస్తే ఆవిడ సనుగుడు, మంచం మీద కూర్చుంటే మా ఆవిడ విసు గుడు గుర్తొస్తుంది... ఇలా చెప్పుకుంటూ పోతే, ఇంటి నిండా ఎన్నో జ్ఞాపకాలు, మా పిల్లలు ఆడిన జ్ఞాపకాలు, మా ఆవిడ నన్ను ఆడిపోసు కున్న జ్ఞాపకాలూనూ. ఇంకా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో ఉన్నాయి... కానీ నీకు బోరు కొడుతుందని చెప్పడం లేదు. కొత్త ఇంటికి వెళితే ఈ జ్ఞాపకాలన్నీ... మాయచేసినట్టు మాయం అయిపోతాయి. కొన్ని దశాబ్దాలుగా అలవాటు పడ్డ ఆ జీవితాన్ని ఈ జన్మకి మార్చు కోలేను.అందుకే ఆ జ్ఞాపకాలతో, రెండేళ్ళుగా హాయిగా బతికేసాను...

ఇల్లు అమ్ముతాను అని మా వాడు అనగానే, నాకు ఒకసారే భయం పుట్టుకొచ్చింది. మా వాడు ఎంత పెద్ద ఇల్లు కొన్నా, ఇన్ని జ్ఞాపకాలు అందులో నేను వెతు క్కోగలనా? పైగా ఈ జ్ఞాపకాలు లేకుండా ఒక్కడినే అంత పెద్ద ఇంట్లో ఏం చేస్తాను... నాకు ఏవీ తోచదు రా! అందుకనే ఈ జ్ఞాపకాలతో ఇలానే మా ఆవిడని తలుచుకుని... తిట్టుకుని... సంతో షంగా ఇక్కడే, మా పెరటి చెట్టున పండిన జాంపండులా నేల రాలి పోవాలని నా కోరిక. మా వాడికి చెప్తే సరే నీ ఇష్టం! అలాగే రాలిపో అన్నాడు...

నీకు ఎలా చెప్పాలో అర్థం కాక ఆలోచి స్తుండగా...ఇదిగో నువ్వే నేరుగా వచ్చి ఇలా నన్ను వేపుకు తింటున్నావ్? పైగా బుంగ మూతి పెడితే ఎలా? నేను నీ స్నేహితుడిని కూడా... నీతో చిన్నప్పుడు నుంచి కలిసి పెరి గిన వాడిని... నువ్ ఏవీ అనుకోకూడదు." చెప్పాడు సుబ్బారావ్.


"నువ్వేం చెప్పినా... మాట మీద నిలబడక పోవడం మాత్రం సబబు కాదురా!... నువ్వు అన్నావని నేను వాళ్లకి చెప్పేసాను. నా మాట నమ్మి ఆశతో గెంతుకుంటూ నీ దగ్గరకి వచ్చిన వాళ్ళు... నీ మాటలతో నిరాశగా కాళ్ళీడ్చు కుంటూ వెనక్కి వెళ్ళారు...అందుకనే అలా నీ మీద రంకెలేసాను...నాకేం తెలుసు ఇలా అని... పోన్లే ఆ తంటాలేవో పడి నేను వాళ్ళకి నచ్చ చెప్తాలే. కానీ నేను ఇలా అన్నానని నువ్వు మరోలా అనుకోకు!" అన్నాడు.

"నేనేం అనుకోను గాని... నిన్ను చూస్తేనే బాధగా ఉంది... నా కారణంగా వాళ్ళతో బోలెడు తిట్లు తిన్నావ్!... చాలా అవమాన పడ్డావ్. అదే నాకు కొంత మింగుడు పడటం లేదు!" చేతులు నులుముకుంటూ ఇబ్బందిగా అన్నాడు సుబ్బారావ్.

"పర్లేదులే! నువ్వు మాత్రం నా స్నేహితుడివి కాదూ? ఇదే నా అన్నయ్యో, తమ్ముడో చేస్తే నేను మనసులో పెట్టుకుంటానా? కాబట్టి ఈ విషయానికి ఇక్కడితో విడాకులిచ్చేయ్!..." అన్నాడు పళ్ళికిలిస్తూ...

"అలా ఎలా వదిలేస్తాను?... నువ్వు నా గురించి మాట పడ్డావ్ కనుక... నీకు ఈ ఇల్లు అమ్మించి పెడితే ఎంత కమీషన్ వచ్చేదో, అది నేను ఇస్తానులే!..." అన్నాడు సుబ్బారావ్ చిరునవ్వుతో.

"హమ్మయ్య! ఆ మాట అన్నావ్ బాగుంది!" అంటూ కాస్త నవ్వు మొహంతో వెను తిరిగాడు శేఖరం.





# నెల నెలా నవ్వుల వెన్నెల

ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.




**ఈ నెల అంశం- హనీట్రాప్**


నిర్వహణ: లాల్



























నీ తేనె కళ్ళ వయ్యారి చూపులతో నీ సోయగాలతో నన్ను హనీట్రాప్
చేసి నా దగ్గరున్న రహస్యాలను రాబట్టు కోలేవు తెలుసా... !!



తొందరపడకండి .. బ్రోస్..అది ఒక హనీ ట్రాప్..
AI తో క్రియేట్ చేసింది



ఈరోజుల్లో ఎవర్ని నమ్మాలో..ఎవర్ని నమ్మకూడదో అస్సలు అర్థం కావటంలేదురా..నిన్న నాకూ దానికీ ఎంగేజ్‌మెంటు జరిగిందని
రాత్రి ఆమె ఫోన్ కి రెండు లక్షలు పంపి ఖరీదైన నగలు కొనుక్కోమంటే - పీడ తల్లి...ఆ రెండు లక్షలు తీసుకుని
ఎవడితోనో జంపయ్యింది...
?!
BUS STOP


అరే రవీ! ఆరేళ్ళ నుండీ ఊరూరా
తిరిగినా ఆడపిల్లని వెంటపడుతూ ఉన్నావు.
జాగ్రత్త, హానీట్రాప్‌లో పడి-
అంతరించిపోగలవు.
పి.వి.నాయుడు.


మాజీ మంత్రిగారు
మీది చిక్కర్ స్కామా!
కాదు ...
హనీ ట్రాప్!
జైలు
Omkar.


'హనీ ట్రాప్' అంటే
ఏమిటుందండీ?
నీ ప్రశ్నలోనే జవాబుంది కదే!
హానికర విషయాలు మనకెందుకే!


మన యంగ్ హీరో గారు 'హనీ ట్రాప్' లో
పడ్డారంటే మరోలా అనుకున్నను....
HONEY
CINI
HEROINE


నిన్ను హనీట్రాప్ చేసానని అందరూ
అనుకుంటున్నారు. కానీ నువే నన్ను ట్రాప్ చేసావని
తెలీదు ..



కూర్పు: పోపూరి విశ్వనాథ్-9133197111




| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | | 4 |
| | ■ | | ■ | 5 | | ■ | |
| 6 | | | | ■ | 7 | 8 | |
| | ■ | | | 9 | ■ | | ■ |
| ■ | 10 | | | | | | ■ |
| 11 | ■ | | ■ | | ■ | ■ | 12 |
| 13 | 14 | ■ | 15 | | 16 | | |
| ■ | 17 | | | ■ | | ■ | |

## ఆధారాలు

**అడ్డం**

1. రవీంద్రుని ఈ విశిష్ట రచనకు నోబెల్ బహుమతి లభించింది (4)
3. బ్రతికున్న ప్రతిజీవికీ అటునుంచి వేసేది (3)
5. బంగారునగలు చేయడంలో దీనిని తప్పక కలుపుతారు (2)
6. సుందరి (4)
7. ఆకాశం, వస్త్రం (3)
10. తాంబూలానికి తప్పనిసరిగా కావలసినవి (6)
13. పాలనూ నీటినీ వేరుచేసేపక్షి (2)
15. ఈ చెట్టును ఎక్కించడమంటే పొగిడి... వెటకారం చేయడం (5)
17. శ్రీకృష్ణుని పల్లె మనతెలుగునాటిదేనా (3)

**నిలువు**

1. ఒప్పందం సరిగాలేదు (4)
2. 1అడ్డపు రచయిత రాసిన మన జాతీయగీతం (6)
3. గొంతు లోపలిభాగం పైకొచ్చింది (3)
4. ఆసరా (3)
8. జవాబు (3)
9. ఆదాయం (4)
11. ఎత్తుగడ (2)
12. కుదువ, తనఖా సరిగాలేదు (3)
14. ఇలా అంటే ఒప్పుకున్నట్లు (2)
15. మూటతోపాటు దీనినికూడా సర్దుకుంటారట (2)
16. .....పెట్టెలో వ్యాపారస్తులు డబ్బు ఉంచుతారు (2)

## పదానందం-31 సమాధానం

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 త | ■ | 2 చం | ■ | 3 బా | పు | ■ | 4 గో | పా | ల |
| రి | ■ | ద్ర | ■ | రి | ■ | 5 పి | పి | ■ | ■ |
| 6 శై | ల్లి | ■ | 7 స | ■ | 8 ఓ | ■ | ■ | 9 కా | 10 జ |
| ల్లి | ■ | ■ | 11 ర | మ | ■ | ■ | 12 థ | ■ | య |
| ■ | 13 బ్లిం | ■ | సి | ■ | 14 శ్రీ | ధ | ర్ | ■ | దే |
| ■ | ■ | 15 శ | ■ | ■ | ■ | ■ | ■ | 16 రా | వ్ |
| 17 రా | మ | ■ | 18 రా | ■ | 19 బో | ■ | 20 ద్రౌ | ■ | ■ |
| మ | ■ | 21 రా | ము | ■ | మ్మ | ■ | 22 సి | రి | ■ |
| 23 కృ | ష్ణ | ■ | ■ | ■ | న్ | ■ | ద్ధ | ■ | 24 ప |
| ష్ణ | ■ | 25 రా | గ | తి | ■ | 26 ర్త | ■ | 27 ప | ద్మా |






సంవత్సర చందా-రూ.300/- 2 సంవత్సరాల చందా-రూ.600/-

జీవిత చందా-రూ.5000/-


Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P



# Brewstark®

Clothing

Brewstark is a contemporary clothing brand offering premium shirts, jeans, trousers, and T-shirts crafted with uncompromised quality and style. Blending comfort, perfect fit, and dist inctive design, Brewstark creates versatile fashion for the passionate and ambitious



Plot # S17,
Road No.10C,
Jubilee Hills,
Hyderabad.



9000222411

Hasyanandam June-2026 RNI No. APTEL 08387/01/1/2003-TC

# S.K.P.V.V. DOKUPARTI UPENDRA
# ENGLISH MEDIUM HIGH SCHOOL

(Sponsored by S.K.P.V.V. Hindu High Schools' Committee)

9000529938 Jakkampudi, Vijayawada - 12.

SKPVV INSTITUTIONS
Educating the Community since 1907

**CBSE Curriculum**

## 6.5 Acres of World Class Institution @ Jakkampudi

1.5 acres for International Standards Construction
5 acres for Eco Environmental Education




## KEY HIGHLIGHTS

- Concept Based Learning
- Smart Classrooms
- Modern Visualized Labs
- Arts & Sports
- Life Skills Learning
- Caring Campus
- Qualified Teachers
- Confidence, Creativity Scope
- Strong Values
- Skill - Based Learning
- Value - Based Education
- Safe & Supportive Environment
- Continuously Improve




Shooting Area


Football Court


Box Cricket


Arts & Crafts